కావలెను
విశాఖ సమాచారమ్
తెలుగు దినపత్రికకు
గాజువాక, స్టీల్‌ప్లాంట్ ప్రాంతాలకు
విలేఖరులు కావలెను.
సెల్: 8247526179



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 35 విశాఖపట్నం, 11 నవంబరు 2023 శనివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00



Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.


## వీలైనంత వేగంగా జర్నలిస్టుల సొంత ఇంటి కల నెరవేరుస్తాం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు నిబంధనలు సరళతరంగా వుంటాయని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. వీలైనంత వేగంగా జర్నలిస్టుల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృత నిశ్చయంతో వున్నారని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు జరపాలని నిర్ణయిస్తూ క్యాబినెట్ ఆమోదించిన నేపథ్యంలో విశాఖ అక్రిడేటెడ్ జర్నలిస్ట్ ల హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం దస్పల్లా హొటల్లో ఏర్పాటు చేసిన థాంక్స్ గివింగ్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజ రయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభు త్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను 98.9% నెరవేర్చిందని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లు జర్నలిస్టులకి ఇళ్ళ స్థలాలు కేటాయింపు చేశారని అన్నారు. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ప్రతీ జర్నలిస్టుకు సొంత ఇల్లు ఉండాలన్న లక్ష్యంతో (మిగతా 2లో)

## విద్యార్థుల సమస్యలకు స్టీఫెన్ పరిష్కారం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్ర విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల విద్యార్థుల దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించింది. సంవత్సరాల తరబడి పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు సత్వర ఉపశమనం చూపారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థుల సమస్యకు పరిష్కారం చూపడానికి కృషిచేసారు. ఆంధ్రవిశ్వ విద్యాలయం, అనుబంధ కళాశాలల్లో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు మధ్యలో వ్యక్తిగత, అనారోగ్య కారణాలతో ఒక సంవత్సరం విద్యకు దూరమవుతున్నారు. వీరు (మిగతా 2లో)




## పాడేరు ప్రాంతంలో పెరిగిన చలి తీవ్రత

### కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యంలో చలి తీవ్రత పెరిగింది. పాడేరు పరిసర ప్రాంతాల్లో పొగమంచు కమ్ముకుంది. దీంతో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు (మిగతా 2లో)

## జర్నలిస్టులకు బ్రహ్మకుమారీల దీపావళి కానుకలు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** వారదులుగా పని చేసే జర్నలిస్టుల జీవితాల్లో సామాజిక ఆరోగ్యం, సమాజ చైతన్యానికి నిత్యం వెలుగులు (మిగతా 2లో)

## అయోధ్యలో ప్రైవేట్ అతిథి గృహాలకు భూ కేటాయింపు



లక్నో: దీపోత్సవ వేడుకకు ఒక రోజు ముందు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆలయ పట్టణం అయోధ్యకు మరో కానుక ఇచ్చారు. అయోధ్యలో నిర్మిస్తున్న రామ మందిర నిర్మాణం పనులు ఘనంగా ప్రారంభోత్సవ ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి.

ధన్‌తేరస్ పండుగ సందర్భంగా అయోధ్యలోని మఠాలు, దేవాలయాలు, అతిథి గృహాలు మరియు ఇతర వాణిజ్య సముదాయాలకు భూమి కేటాయింపు కోసం యుపి హౌసింగ్ బోర్డ్ రిజిస్ట్రేషన్ ప్రారంభించింది. వచ్చే జనవరిలో గొప్ప రామమందిర ప్రారంభోత్సవంతో, అయోధ్యలో అతిరథమహారథుల కోసం యాత్రికుల రద్దీ చాలా రెట్లు పెరుగుతుందని యుపి ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అయోధ్య లో తమ సొంత అతిథి గృహాలను నిర్మించుకోవడానికి మతపం మైన సంస్థలు, మఠాలు ఇతర రాష్ట్రాలతో పాటు దేశాలు కూడా ఆఫర్ చేసింది.

రామ మందిరంలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమానికి నాలుగు వేల మంది సాధువులు, 2,500 మంది ప్రముఖులు హాజరుకానున్నట్లు శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్ నిర్ణయించింది

నవ్య అయోధ్య

హౌసింగ్ బోర్డు నవ్య అయోధ్య పేరుతో కొత్త టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేస్తోంది, అయోధ్యలోని మాఝా, బర్హతా, తరువా (మిగతా 2లో)

## జిల్లా సమగ్ర అభివృద్ధిపై ఏపీజేఎఫ్ చర్చ




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మేధావుల చర్చ మార్పుకు నాందిగా నిలుస్తుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ మరియు ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విశాఖపట్నం జిల్లా ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి జిల్లా సమానంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరొక సిలికాన్ వాలీగా ముంబై నగరాన్ని ధీటుగా విశాఖ నగరం అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాజకీయ పార్టీలు జిల్లాల వారీగా తాము చేయబోయే ప్రగతిని తమ మేనిఫెస్టో లో పొందుపరచాలని వీటిపై మేధో చర్చ జరిపి విశ్లేషణలు చేయాలని ఆయన సూచించారు. జిల్లాల వారీగా నిర్వహించే ఇటువంటి సదస్సులు అక్కడ మేధావులు అందించే సూచనలు తీసుకుని వీటి ఆధారంగా తయారుచేసిన నివేదికను రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల రూపకల్పనలో ఉపయోగించాలని సూచించారు. దారిద్యరేఖకు దిగువన ఉన్నవారికి సైతం అభివృద్ధి ఫలాలు అందితేనే నిజమైన అభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. వారికి నేరుగా సంక్షేమం ఫలాలను చేరువ చేయడం ఎంతో అవసరమని చెప్పారు. పొడవైన తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్లో సముద్ర ఆధారితంగా సంపద సృష్టించడం, పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం (మిగతా 2లో)

## కొత్తకోట రోడ్డు విస్తరణ ఎప్పుడు ?



**రావికమతం, (విశాఖ సమాచారమ్):** భీమునిపట్నం నుండి నర్సీపట్నం వరకు ప్రతిపాదించిన 100 అడుగుల బి.ఎన్.రోడ్డు విస్తరణపై ప్రజల ఆశలు సన్నగిల్లిపోతు న్నాయి. శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ కృషి ఫలితంగా భీమునిపట్నం నుండి నర్సీపట్నం వరకు 100 అడుగుల వెడల్పుతో చోడవరం, రావికమతం, కొత్తకోట మీదుగా నర్సీపట్నం వరకు 100 అడుగుల రోడ్డు మంజూరైంది. అయితే ఈ రోడ్డు వేసేందుకు రహ దారికి ఇరువైపులా భూసేకరణ చేయ వలసి ఉంది. అనేక సంవత్సరాలుగా రావికమతం మండలానికి చెందిన కొత్తకోట జంక్షన్ పెద్ద వాణిజ్య కేంద్రంగా పేరుగాంచింది. తునికి ఆకులు, వివిధ రకాల గిరిజన ఉత్పత్తులతో ప్రతీ శనివారం ఇక్కడ భారీ స్థాయిలో సంత జరుగుతుంది. 20 గిరిజన గ్రామాల నుండి గిరిజన రైతులు అనేక ఉత్పత్తులను ఇక్కడికి తీసుకువచ్చి అమ్ముతారు. వర్తకులు, ప్రజలు ఈ ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ ఉంటారు. ఇన్నేళ్లైనప్పటికీ కొత్తకోట గ్రామంలో వారపు సంత (మిగతా 2లో)

## భారత్-అమెరికా 2+2 మంత్రుల సమావేశం ప్రారంభం



అమెరికాకు చెందిన మంత్రులతో నేడు న్యూఢిల్లీలో మన రక్షణ, విదేశాంగ శాఖ మంత్రుల కీలక భేటీ మొదలైంది. ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేం దుకు ఇది ఉపయోగపడనుంది.

భారత్-అమెరికా 2+2 మంత్రుల స్థాయి సమావేశం ప్రారంభమైంది. అంతకు ముందు ఇరు దేశాల విదేశాంగ మంత్రులు న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఇవి ఇరు దేశాల మధ్య ఐదో విడత 2+2 చర్చలు కావడం విశేషం. వీటిల్లో పాల్గొనేందుకు అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకన్, రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ నేడు దిల్లీకి చేరుకొన్నారు. ఆ తర్వాత బ్లింకన్ మన విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బ్లింకన్ మాట్లాడుతూ "ఇరు దేశాల మధ్య బంధం ఎన్నడూ లేనంత బలంగా ఉంది. ఈ సంవత్సరం భారత నాయకత్వ పటిమ (మిగతా 2లో)


నాతయ్యపాలెం / గంభీరం / దేశపాత్రునిపాలెం
శివకాశి అయ్యన్ బాణాసంచా షోరూమ్
షీలానగర్: NH-5, మార్బుల్ షాప్ ఎదురుగా, నాతయ్యపాలెం, BHPV పోస్ట్, విశాఖపట్నం
గంభీరం: పైడా కాలేజి ఎదురుగా, శశి కాలేజి రోడ్, గంభీరం, విశాఖపట్నం
దేశపాత్రునిపాలెం: పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా
అయ్యన్ గ్రీన్ క్రాకర్స్ అమ్మబడును
AYYAN'S GREEN CRAKERS AVAILABLE
COMPANY FRESH ITEM · GENUINE RATES
BUNNY BRAND FANCY FIREWORKS
SIVAKASI'S Ayyan'S FIRE WORKS
For Rates Visit: www.vizagayyan.in
NH-5, Opp. Marble Shop, Natayyapalem, SHEELANAGAR, Vizag -12.
Opp. Pydah College, Sasi College Road, GAMBHIRAM, Vizag.
Paravada Mandalam, DESAPATRUNIPALEM, Anakapalli Dist.

# రేషన్ సరుకులు పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** చౌకధరల దుకాణాలలో మరియు ఇంటింటికి రేషన్ పంపిణీ వాహనాలలో సరుకుల పంపిణీలో పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఈ. లక్ష్మీరెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా పౌరసరఫరాల అధికారి సూర్య ప్రకాష రావుతో కలిసి ఆహార కమిషన్ సభ్యులు ఈ.లక్ష్మీరెడ్డి నగరంలో పలు రేషన్ డిపోలను, రేషన్ పంపిణీ వాహనాలను తనిఖీ చేశారు. ముందుగా కంచరపాలెం ఏరియాలో రేషన్ పంపిణీ వాహనాన్ని తనిఖీ చేశారు. బియ్యం స్టాక్ ఎంత వచ్చింది, ఎంత పంపిణీ చేశారు, ఎంతమంది కార్డ్ హోల్డర్స్ ఉన్నారు, రైస్ కార్డులు ఎన్ని ఉన్నాయి, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కార్డ్ హోల్డర్స్ తో మాట్లాడి రేషన్ పంపిణీలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే ఫిర్యాదు చేయాలని, తక్షణ చర్యలు



చేపడతామన్నారు. అనంతరం షీలానగర్ చౌకధర దుకాణం నెం . 0383324 తనిఖీ నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు.

తదుపరి గాజువాకలో మింది దగ్గర ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం, కోడిగుడ్లు రిజిస్టర్ పరిశీలించి, విద్యార్థులతో భోజనం ఎలా ఉంది అనే సమాచారం అడిగి తెలుసుకున్నారు. భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. తదుపరి రిజిస్టర్ పరిశీలించినప్పుడు 1800 కోడిగుడ్లు అధికంగా ఉన్నందున, ప్రధానోపాధ్యాయులు నుండి వివరణ తీసుకుని పంపాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు.

మల్కాపురంలో నక్కాడి పాలెం అంగన్వాడి సెంటర్ లో అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేశారు. పిల్లలతో మాట్లాడి వారికి అందుతున్న వివరాలు తెలుసుకున్నారు. అక్కడ పనిచేస్తున్న సూపర్వైజర్ కు పలు సూచనలు ఇచ్చారు.

అనంతరం వడ్లపూడిలో ఎం ఎల్ ఎస్ గోడౌన్స్ తనిఖీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఓలు జి. మురళీనాథ్, టి కృష్ణ, సిడిపిఓ నీలవేణి, లీగల్ మెట్రాలజి ఇన్స్పెక్టర్ ఉమసుందరి, మరియు రెవెన్యూ ఇన్స్పెక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

**పంచాంగం**

శనివారం 11-11-2023
శోభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం శరదృతువు
ఆశ్వయుజ మాసం

తిథి : బ. త్రయోదశి ప. 12.44
నక్షత్రం : చిత్త రా. 01.47
వర్జ్యం : 09.03 ల 10.45

విశాఖ సమాచారమ్
ప్రతులకు, ప్రకటనలకు
సెల్: 9393949345, 8247526179

## (మొదటి పేజీ తరువాయిలు)

### వీలైనంత వేగంగా జర్నలిస్టుల సొంత ఇంటి కల నెరవేరుస్తాం






జగన్మోహన్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇటీవల కాలంలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి ఇళ్ల స్థలాలు కేటాయించే అంశాన్ని కూడా పరిశీలిస్తామని సుబ్బారెడ్డి హామీ ఇచ్చారు.

విశాఖపట్నం జిల్లాలో పత్రికల్లో పనిచేస్తున్న ప్రతీ ఒక్కరికి మండలస్థాయి, నియోజకవర్గస్థాయి, జిల్లాస్థాయి అక్రిడేషన్ కార్డులు ఉన్నవారికి ఏ ప్రాంతంలో కార్డు ఉంటే ఆ ప్రాంతంలోనే ఇళ్లస్థలాలు కేటాయిస్తామని రాష్ట్రమంత్రి గుడివాడ అమర్నాథ్ తెలియజేశారు. జగన్మోహనరెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ సమావేశంలో రాష్ట్రస్థాయి అక్రిడేషన్ కార్డు ఉన్నవారికి వారు కోరుకున్నచోట ఇళ్లస్థలాలు కేటాయిస్తామని చాలామంది జర్నలిస్టులు అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలోనే ఇళ్లస్థలాలు కోరుకుంటున్నారని దానివల్ల భీమునిపట్నం ప్రాంతంలో నగరంలోని జర్నలిస్టులు ఇంటిస్థలాలు కోరుతున్నారని సాధ్యమైనంతవరకు అందరికీ ఒకేచోట ఇచ్చే అవకాశం పరిశీలిస్తామని కానీ క్యాబినెట్ నిర్ణయం ప్రకారం మండలస్థాయి వారికి మండలాల్లోని, జిల్లాస్థాయి వారికి జిల్లాలోను, రాష్ట్రస్థాయి వారికి వారు కోరుకున్నచోట మూడు సెంట్లు ఇంటిస్థలాన్ని త్వరలో అందజేసేందుకు నియమనిబంధనలు జీఓ కాపి రాబోతుందని విలేకర్ల నుద్దేశించి ఆయన మాట్లాడారు.

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్లస్థలాలను కేటాయిస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం దీపావళి కానుకగా అభివర్ణించారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 నుంచి 20 వేల మంది జర్నలిస్టులకు సొంత ఇంటి కల నెరవేరనుందని అన్నారు . అర్బన్ , రూరల్ అనే తారతమ్యం లేకుండా జర్నలిస్టులందరికీ సమానంగానే ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని మంత్రి అమర్నాథ్ చెప్పారు. సమాజం కోసం జర్నలిస్టులు పనిచేస్తున్నారని వారి కోసం తాము అండగా ఉంటామని అన్నారు. న్యాయవ్యవస్థకు ఎటువంటి స్వేచ్ఛ ఉందో, జర్నలిస్టులకు కూడా అదే విధమైన స్వేచ్ఛ ఉండాలని మంత్రి అమర్నాథ్ ఆకాంక్షించారు. పత్రికా యాజమాన్యాల వైఖరి ఎలా ఉన్నా, క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలను ప్రభుత్వానికి తెలియజేసే ఉన్నతమైన వ్యవస్థ జర్నలిజమని అన్నారు. జర్నలిస్టులకు మంజూరు చేసే ఇళ్ల స్థలాలకు సంబంధించి ఒకటి రెండు రోజుల్లో ప్రభుత్వ ఉత్తర్వులు వస్తాయని, ఇందులో జర్నలిస్టులకు ఇబ్బందికరమైన ఆంక్షలు ఏమైనా ఉంటే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి. జర్నలిస్టులకు అనుకూలంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనే విధంగా చూస్తామని అమర్నాథ్ హామీ ఇచ్చారు.

మాజీ మంత్రి, భీమిలి శాసనసభ్యులు అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టులకి స్థలాల కేటాయింపు ప్రక్రియ మూడు నెలల లోపు పూర్తి చేస్తే బాగుంటుందని అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. కరోనా కాలంలో కూడా జర్నలిస్టులు ప్రాణాలకు తెగించి పని చేశారని, అప్పట్లో ఇబ్బంది పడిన వారికి కూడా ఇళ్ల స్థలాలు కేటాయిస్తే బాగుంటుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ గౌరవ అధ్యక్షులు కేజీ రాఘవేందర్ రెడ్డి, జి జనార్దన్ రావు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయింపు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గత రెండు నెలల కాలంలో తమ సొసైటీ చేసిన కృషిని వివరించారు. వైసిపి ఉత్తరాంధ్ర ఇంచార్జ్ వైవి సుబ్బారెడ్డి జిల్లా మంత్రి అమర్నాథ్, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ మల్లికార్జున అందించిన సహకారాన్ని తాము ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటామని చెప్పారు. సుదీర్ఘ కాలంగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల కల నెరవేరుతుండటం తో ప్రతీ జర్నలిస్టు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. విశాఖ నగరానికి దగ్గరలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించేలా ప్రయత్నం చేయాలని కోరారు.

విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు బి.రవికాంత్ మాట్లాడుతూ ఈ ఏడాది అక్రిడేషన్ ఉన్న వారిని మాత్రమే కాకుండా 2006 నుంచి 2019 వరకూ అక్రిడేషన్ కలిగి ఉన్న జర్నలిస్టులను కూడా ఇళ్ల స్థలాల కేటాయింపులో పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా జర్నలిజాన్నే వృత్తిగా చేసుకుని అక్రిడేషన్ లేకుండా ఉన్న పాత్రికేయులకు కూడా అవకాశం కల్పించాలని కోరారు. ఇటీవల కాలంలో పలు కారణాలతో మృతి చెందిన జర్నలిస్టులు, తీవ్ర అనారోగ్యంతో వృత్తికి దూరమైన పాత్రికేయులకు కూడా మానవతా దృక్పథంతో ఇళ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఏపీఎంఎస్ఎండీసీ ఛైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జీవి, విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ గౌరవ సలహాదారులు పి. సత్యనారాయణ, ధవలేశ్వరం రవికుమార్, ఉపాధ్యక్షులు పి. రామకృష్ణ, కోయిలాడ పరుశురాం, దుక్కా మురళీకృష్ణ రెడ్డి, ఉమామహేశ్వరరావు, రవిచంద్ర, సహాయ కార్యదర్శి ఎం చిట్టిబాబు, అనురాధ, బందరు శివప్రసాద్, ఉప్పల భాస్కర్ రావు, పి .శ్రీనివాసరావు,కోశాధికారి ఆలపాటి శరత్ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బొప్పన రమేష్, పీఏ రావు, ప్రత్యేక ఆహ్వానితులు ఈశ్వర్, కమల్ , కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మి, బి.శ్రీనివాసరావు, పాలికి రవి కుమార్, కే .ఎం. కీర్తన్, పి.ఈశ్వరరావు, స్వామి, శ్రీధర్, లక్ష్మణరావు, అనీష్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల సమస్యలకు స్లీఫెన్ పరిష్కారం

తిరిగి ప్రవేశం పొందడం డిగ్రీ పూర్తిచేయడం జరుగుతోంది. వీరు తొలుత ప్రవేశం పొందిన సమయంలో ఉన్న సిలబస్, రెండవ పర్యాయం ప్రవేశం పొందినపుడు ఉన్న సిలబస్‌లలో వ్యత్యాసం ఉండటంతో విద్యార్థికి సర్టిఫికేట్ జారీలో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఈ సమస్య కొద్దిరోజుల క్రితం రిజిస్ట్రార్ దృష్టికి వచ్చింది. దీనిని పరిశీలించిన అనంతరం ఏయూ పరీక్షల విభాగం డీన్, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, బిఓఎస్ చైర్మన్లను పిలచి ఈ రోజు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వీరంతా సుదీర్ఘంగా చర్చించి పలు పరిష్కారాలను సూచించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా నిలచే విధంగా నిర్ణయం తీసుకోవాలని అందరూ నిర్ణయించి సుదీర్ఘంగా చర్చించి నూతన విధానాన్ని రూపకల్పన చేసారు. దీనిని అకడమిక్ సెనేట్ సమావేవంలో ఉంచి ఆమోదించి విద్యార్థులకు అమలు చేస్తారు. తద్వారా మధ్యలో చదువు ఆపివేసి తిరిగి చదువుకుని డిగ్రీ పూర్తిచేసే వందలాది మంది విద్యార్థులకు ఇది ఎంతో ఉపయుక్తంగా నిలవనుంది.

అధికారులు ఈ దిశగా ఆలోచన చేయడం పట్ల అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్స్ సైతం సంతోషం వ్యక్తం చేశారు. నూతన విద్య విధానం(ఎన్ఈపి 2020)లో మల్టీ ఎంట్రీ, మల్టీ ఎగ్జిట్ విధానం అమలు అవుతోంది. ప్రతస్తుం ఏయూ అధికారులు రూపొందించే నూతన పాలసీ వీరికి సైతం అమలు చేయడానికి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది. విద్యార్థి తాను చేరిన కోర్సులో కాస్త విరామం తీసుకుని స్టార్టప్,ఇంక్యుబేషన్ ప్రారంభించి, తిరిగి తన విద్యాభ్యాసం పూర్తిచేయాలనుకునే సమయంలో వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడటానికి అధికారులు చేసిన ఈ నూతన విధానం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది. ఈ సమావేశంలో అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, పీజీ పరీక్షల డీన్ ఆచార్య డి.వి.ఆర్ మూర్తి, డాక్టర్ వి.ఎస్.కృష్ణ, ఏ.వి.ఎన్, ప్రభుత్వ మహిళా కళాశాలల ప్రిన్సిపాల్స్, పరీక్షల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పాడేరు ప్రాంతంలో పెరిగిన చలి తీవ్రత

ఇబ్బంది పడుతున్నారు. పొగమంచు తీవ్రతతో ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించకపోవడంతో లైట్లు వేసుకుని వెళ్తున్నారు. పాడేరు సమీపంలోని మినుములూరు కాఫీ బోర్డు వద్ద శుక్రవారం ఉదయం 14.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

### జర్నలిస్టులకు బ్రహ్మకుమారీల దీపావళి కానుకలు

చిందించాలని మహా విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన దీపావళి వేడుకలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతను ఇస్తూ ఈ దీపావళిని జర్నలిస్టులు కుటుంబ సభ్యులు జరుపుకోవాలన్నారు. విశ్వభారత్ స్వచ్ఛంధ సేవాసంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి.రమేష్ మాట్లాడుతూ విశాఖ నుంచి రాష్ట్ర బృందంగా న్యూఢిల్లీ బాలోత్సవానికి హాజరవుతున్న బాల కళాకారులను అభినందించారు. మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతీకలుగా దీపావళి, సంక్రాంతి పండుగలను అభివర్ణించారు. బ్రహ్మకుమారి రామేశ్వరి మాట్లాడుతూ సనాతన సంప్రదాయాలు, ఆచారాలు పండుగల రూపంలో మేళవించి జరుపుకుంటున్నాం. సామాజిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలను ఆశించి మన పూర్వికులు మనకు ఈ పండుగల విధానాలను రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, సీనియర్ జర్నలిస్ట్. కొరియోగ్రాఫర్ "ఆర్. నాగరాజ్ పట్నాయక్, సంఘమిత్ర సేవా సంస్థ సారథి సూరిబాబు, కళాసంస్థల ప్రతినిధాలు బాదంగిరిసాయి, నాంచారయ్య, సిద్దూ తదితరులు పాల్గొన్నారు.

### అయోధ్యలో ప్రైవేట్ అతిథి గృహాలకు భూ కేటాయింపు

మరియు షానవాజ్‌పూర్ గ్రామాలలో బోర్డు కొనుగోలు చేసిన 1854 ఎకరాల భూమిలో కొత్త టౌన్‌షిప్ అభివృద్ధి చేయబడుతుంది.

భూమి కేటాయింపు కోసం రిజిస్టరీ

మఠాలు, వాణిజ్య సముదాయాలకు 40 ప్లాట్ల కేటాయింపునకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను శుక్రవారం ప్రారంభించినట్లు హౌసింగ్ బోర్డు అధికారులు తెలిపారు. వీటిలో 28 ప్లాట్లు మఠాలకు, 12 వాణిజ్య సముదాయాలకు కేటాయించబడ్డాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ నవంబర్ 24న ముగుస్తుంది, మరుసటి రోజు తుది కేటాయింపు కోసం లాటరీని వేయాలి. మట్‌లకు ప్లాట్‌ల ధర చదరపు మీటరుకు 50నుండి55000 వరకు నిర్ణయించబడింది మరియు దరఖాస్తును ఆన్‌లైన్‌లో మాత్రమే చేయవచ్చు. వాణిజ్య సముదాయాల వేలం కూడా ఆన్‌లైన్‌లోనే జరుగుతుందని అధికారులు

అతిథి గృహాల కోసం ప్లాట్లు కేటాయించారు

అంతేకాకుండా, అయోధ్యలో అభివృద్ధి చేస్తున్న కొత్త టౌన్‌షిప్‌లో అతిథి గృహాల కోసం హౌసింగ్ బోర్డు ప్లాట్‌లను కూడా అభివృద్ధి చేసింది. అయోధ్యలో అతిథి గృహాలు నిర్మించాలనుకునే రాష్ట్రాలకు ఈ ప్లాట్లను కేటాయిస్తామని అధికారులు తెలిపారు. యూపీ ప్రభుత్వం అయోధ్యలో అతిథి గృహం కోసం రాష్ట్రాలు మరియు ఇతర దేశాలకు భూమిని ఇచ్చింది.

ఇప్పటి వరకు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, సిక్కిం, అసం, ఉత్తరాఖండ్ మరియు అరుణాచల్ ప్రదేశ్ గెస్ట్ హౌస్ ప్లాట్ల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. గెస్ట్ హౌస్ కోసం గుజరాత్ రాష్ట్రానికి బోర్డు ఇప్పటికే 6000 చదరపు మీటర్ల స్థలాన్ని కేటాయించింది. శ్రీలంక, నేపాల్ మరియు దక్షిణ కొరియాలు కూడా అయోధ్యలో తమ స్వంత అతిరథమహారథుల కోసం శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. వారితో పాటు సాధారణ భక్తులకూ ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా దాదాపు 25 వేల మంది భక్తుల కోసం టెంట్ సిటీ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. అధిక సంఖ్యలో హాజరయ్యే భక్తులు అయోధ్య వాసుల ఇళ్లలో, హోటళ్లలో రుసుము చెల్లించే అతిథులు (పెయింగ్ గెస్ట్)గా బస చేసేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

సరయూ నది ఒడ్డున ఉన్న రామకథా మండప్ (ఆడిటోరియం)లో ఉత్తరప్రదేశ్ మంత్రివర్గం సమావేశం జరిగిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఉత్తరప్రదేశ్ చరిత్రలో ఈరోజు కొత్త అధ్యాయం చేరిందని, యూపీ ప్రభుత్వ కేబినెట్ మొత్తం అయోధ్య ధామానికి వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు.

"యుపి అభివృద్ధికి సంబంధించి ఈరోజు ఒక ముఖ్యమైన సమావేశం జరిగింది. అయోధ్యలో ఇప్పటికే30,500 కోట్ల కంటే ఎక్కువ విలువైన కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల 178 పథకాలు నడుస్తున్నాయని మాకు తెలుసు..."

అయోధ్య అభివృద్ధికి సంబంధించిన 14 ప్రాజెక్టులకు తన కేబినెట్ ఆమోదం తెలిపిందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గురువారం ప్రకటించారు

### జిల్లా సమగ్ర అభివృద్ధిపై ఏపీజేఎఫ్ చర్చ

ఎంతో అవసరమని చెప్పారు.

ఏయు ఆర్థిక శాస్త్ర విశ్రాంతి ఆచార్యులు కె.శ్రీరామమూర్తి మాట్లాడుతూ సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రగతి కలిసి సాగాలని సూచించారు. ప్రజలను సామర్థ్యవంతులగా తీర్చిదిద్దడమే నిజమైన అభివృద్ధి అని చెప్పారు. ప్రజలు ఆర్థిక స్వావలంబనకు చేరుకోవడం ఎంతో అవసరమని వివరించారు. సముద్ర వనరులను సమగ్రంగా, సక్రమంగా వినియోగించాలని ఆయన సూచించారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ విసి హనుమంతు లజపతిరాయ్ మాట్లాడుతూ అభివృద్ధిపై విద్యావంతులకు అవగాహన కలిగి ఉండడం ఎంత అవసరమని చెప్పారు. విశాఖ నగరం రాష్ట్రానికి ఒక గ్రోత్ ఇంజన్ గా పని చేస్తుందని అన్నారు. రాజకీయ దృక్కోణంలో మాట్లాడం ఎంత మాత్రం సరికాదని చెప్పారు. నాణ్యమైన సేవలే అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తాయని చెప్పారు. గ్రోత్ - డెవలప్మెంట్ మధ్య ఉండే స్వల్ప వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవాలని అన్నారు. నాడు- నేడు అనే ఒక సంక్షేమ పథకంతో నేడు రాష్ట్రంలో నాణ్యమైన విద్యను రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సైతం అందిస్తున్న విధానం ఒక ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 14 దేశాలు బహుళ రాజధానులను కలిగి ఉన్నాయని అదే తరహాలో ఆంధ్రప్రదేశ్ మూడు రాజధానులు కలిగి ఉండడం జరుగుతోంది చెప్పారు. స్థూల జాతీయా సంతోషాన్ని-ఆనందసూచికను సైతం పరిగణలోనికి తీసుకోవడం ఎంతో అవసరమని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు మాట్లాడుతూ నేడు ప్రజల అవసరాలు పెరుగుతున్నాయని చెప్పారు. స్థానికంగా సమస్యలపై పరిశోధనలను విశ్వవిద్యాలయాలు చేస్తున్నాయని, వీరి సూచనలను పరిగణలోకి తీసుకోవాలని చెప్పారు. ప్రతి జిల్లాలో ఉండే వనరులు, అవకాశాలు, అడ్డంకులపై విస్తృతంగా చర్చించాలని చెప్పారు. పాలకులకు మార్గనిర్దేశం చేసే దిశగా ఒక నివేదికను తయారుచేసి అందిస్తామని అన్నారు.ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పోతుమహంతి నారాయణ్ మాట్లాడుతూ మేధావులు తమ ఆలోచనను పంచుకోవాలని అన్నారు. అభివృద్ధికి బాటలు వేసే దిశగా ఈ సదస్సు నిలుస్తుంది అనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాలను మరింతగా అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు.

ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ అన్ని రంగాలలో ఆంధ్రప్రదేశ్ ప్రగతి సాధిస్తుందని చెప్పారు. ప్రజల వద్దకే సంక్షేమ పథకాలతో అత్యధికంగా లబ్ధి చేకూరుతుందని అన్నారు. పారిశ్రామిక, ఆర్థిక రాజధానిగా విశాఖ నగరం నిలుస్తోందని చెప్పారు. రైల్వే జోన్ పనులు మరింత వేగవంతం కావాలని తద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ఉత్తరాంధ్రకు పుష్కలంగా జల వనరులు ఉన్నాయని వీటిని సక్రమంగా వినియోగించడం ఎంతో అవసరమని చెప్పారు. విభజన సమయంలో వెనుకబడిన జిల్లాలుగా పరిగణించబడిన ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేంద్రం సత్వరం విడుదల చేయాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ మణిరాం,కార్యక్రమంలో కామర్స్ మేనేజ్మెంట్ ఆచార్యులు ఆచార్య పి విశ్వనాథం,చైతన్య స్రవంతి అధ్యక్షురాలు డాక్టర్ శిరీన్ రహమాన్,డాక్టర్ పెంటకోట రామారావు, భరణికాన రామారావు పలువురు నిష్ణాతులు, సమాఖ్య నేతలు,తదితరులు ప్రసంగించారు.

### కొత్తకోట రోడ్డు విస్తరణ ఎప్పుడు ?

కోసం ప్రత్యేక స్థలం ఏర్పాటు కాలేదు. ఫలితంగా ఇంకా రోడ్డు మీదే సంత జరుగుతోంది.

కొత్తకోట మెయిన్‌రోడ్డులో సుమారు అరకిలోమీటర్ మేర స్థానికులు ఎప్పటి నుండో శాశ్వత దుకాణాలు సొంత భవనాలలో ఏర్పాటు చేసుకొని ఉన్నారు. రోడ్డు విస్తరణ జరిగితే అరకిలోమీటర్ మేర చాలా దుకాణాలు మరియు భవనాలు తొలగించవలసి ఉంటుంది. అంతేగాక భవిష్యత్తులో అక్కడ సంత ఏర్పాటు చేయడం కూడా వీలుకాదు. ఈ నేపథ్యంలో కొందరు భవన యజమానులు, కొందరు భవనాల యజమానులు, వర్తకులు రోడ్డు విస్తరణ జరగకుండా తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారని ఎమ్మెల్యే అనుచరులు చెబుతున్నారు. రోడ్డు విస్తరణకు భూసేకరణ చేపట్టే విషయంలో ఎమ్మెల్యే స్థానికుల మాటను కాదని అధికారులకే మద్దతు ఇస్తున్నప్పటికీ ఆయన కంటే బలంగా భవన యజమానులు అడ్డుకుంటున్నారని, ఎన్నికలు జరిగేలోగా రోడ్డు విస్తరణ జరిగితే ఎమ్మెల్యే ధర్మశ్రీకి మంచి పేరు వస్తుందని అందుకోసం ఆయన విశేషంగా కృషి చేస్తున్నారని ఆయన వర్గీయులు చెబుతున్నారు. అయితే రోడ్డు విస్తరణతో పని లేదని కొత్తరోడ్డును బైపాస్ రోడ్డుగా కూడా నిర్మించవచ్చని అనవసరపు మలుపులు తొలగించి మంచిరోడ్డు నిర్మించే అవకాశాలు ఉన్నాయని, అధికారులు ఈ విషయాన్ని పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

### భారత్-అమెరికా 2+2 మంత్రుల సమావేశం ప్రారంభం

జీ20 నిర్వహణతో రుజువైంది. మా రక్షణశాఖ సహచరులతో కలిసి మేం చేయాల్సింది చాలా ఉంది. ఇండో-పసిఫిక్‌పై అమెరికా బలంగా దృష్టి సారించిందన్న విషయానికి ఇది నిదర్శనంగా నిలుస్తుంది. భారత్‌తో కలిసి ఇండో-పసిఫిక్ ప్రాంత భవిష్యత్తు కోసం పనిచేస్తాం" అని పేర్కొన్నారు.

"మేము మా ఆర్థిక వ్యవస్థలను మరింత స్థితిస్థాపకంగా మార్చడానికి మరియు కలుపుకొని ఆర్థిక అవకాశాలను విస్తరింపజేసేటప్పుడు మా కమ్యూనిటీలను మరింత సురక్షితమైనదిగా చేయడానికి ఆవిష్కరణల శక్తిని కలిసి ఉపయోగించుకుంటున్నాము" అని వార్షిక 'టూ-ప్లస్-టూ' చర్చల ప్రారంభ వ్యాఖ్యల సందర్భంగా యుఎస్ అగ్ర దౌత్యవేత్త చెప్పారు. రెండు దేశాల విదేశాంగ మరియు రక్షణ మంత్రుల మధ్య.

సహకారం యొక్క నిర్దిష్ట రంగాలను హైలైట్ చేస్తూ, బ్లింకెన్ సెమీకండక్టర్స్ మరియు అధునాతన బయోటెక్నాలజీలో పురోగతిని ప్రస్తావించారు, ఇది భారతదేశం మరియు యునైటెడ్ స్టేట్స్ మధ్య సాంకేతిక సహకారం యొక్క లోతును ప్రతిబింబిస్తుంది. దేశాల్లో మరియు ప్రాంతం అంతటా క్లీన్ ఎనర్జీని విస్తరించడంలో అపూర్వమైన పెట్టుబడులను కూడా ఆయన సూచించారు.

"చివరిగా, మేము మా ప్రజల మధ్య గొప్ప సంబంధాలను మరింతగా పెంచుతున్నాము, ఇది నిజంగా ప్రతిదానికీ గుండె వద్ద ఉంది. కొత్త విద్యా మార్పిడిని అన్వేషించడం, మన దేశాల మధ్య ప్రయాణాన్ని సులభతరం చేయడానికి , వీసా నిరీక్షణ సమయాన్ని తగ్గించడం.. భారతీయులు మరియు అమెరికన్లు కలిసి చదువుకున్నప్పుడు, కలిసి పనిచేసినప్పుడు మరియు కలిసి పనిచేసినప్పుడు, పురోగతికి అవకాశాలు అనంతం, "అన్నారాయన.

ఈ సందర్భంగా జీ20 నిర్వహణకు సహకరించిన అమెరికాకు కేంద్ర మంత్రి ఎస్ జైశంకర్ ధన్యవాదాలు తెలిపారు. "మేం చాలా విజయవంతంగా జీ20 సదస్సు నిర్వహించాం. అందుకు అమెరికా అధ్యక్షుడు, ప్రభుత్వానికి మా ప్రధాని మోదీ తరఫున ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను. అమెరికా సహకారం లేకపోతే.. ఈ సదస్సులో ఏకాభిప్రాయం సాధ్యమవుతుందని నేను అనుకోవడంలేదు" అని పేర్కొన్నారు.

సన్నిహిత సంబంధాలున్న దేశాల మధ్య వివిధ కార్యక్రమాలు, రక్షణ, భద్రతకు సంబంధించిన అంశాలపై పురోగతిని సమీక్షించేందుకు 2o2 విధానంలో చర్చలు నిర్వహిస్తారు. ఇరు దేశాలు క్వాడ్, ఇండోపసిఫిక్ వంటి అంశాలపై చర్చించే అవకాశం ఉంది. తాజాగా ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం అంశం కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది.

# విశాఖ సమాచారమ్

శనివారం 11-11-2023


## సంస్కరణలకు స్వాగతం

నగరంలో ఆయుష్ శాఖ అధికారులు అనుమతి లేని ఆయుర్వేద దుకాణాలను మూయించడం శుభపరిణామం. ప్రభుత్వ అనుమతి లేకుండా నగరంలో వేలకు వేల దుకాణాలు నిర్వహిస్తున్నారు. చదువుకున్నవారు, చదువుకోని వారు ఒకేలా ఈ విషయంలో ప్రవర్తిస్తున్నారు. ఏ వ్యాపారం చేయాలన్నా సంబంధిత ప్రభుత్వ అధికారుల నుండి తగిన అనుమతి పొందాలి అనే విషయం చాలామందికి తెలియడం లేదు. ఇందుకు కారణం ఈ విషయం చట్టబద్ధమైనదనే అవగాహన లేకపోవడం. ప్రభుత్వ శాఖలు తమకు ఉచితంగా లభిస్తున్న మీడియా సేవలను వినియోగించుకొని చట్టబద్ధతపై తగిన అవగాహన కల్గించాలి.

ఆయుర్వేద మందుల దుకాణాల కంటే అతి ముఖ్యమైన వ్యాపారాలు నగరంలో చాలానే ఉన్నాయి. ఉదాహరణకు రెవెన్యూ డివిజనల్ అధికారి అనుమతి తీసుకోకుండా ఎవ్వరూ ప్రింటింగ్ ప్రెస్‌లను ఏర్పాటు చేయకూడదు. 1867 పీఆర్‌బీ చట్టంప్రకారం అలా ఎవరైనా ప్రెస్‌ను ఏర్పాటు చేస్తే ఆర్డీఓ అట్టి ప్రింటింగ్ ప్రెస్‌ను తక్షణమే మూసివేయడమే కాకుండా అలా ఏర్పాటు చేసిన వ్యక్తికి రెండునెలల జైలుశిక్ష కూడా విధించవచ్చు. ముఖ్యంగా పత్రికలను ముద్రించేవారికి ఈ చట్టం నేరుగా వర్తిస్తుంది. పత్రిక ముద్రణ ప్రారంభించేందుకు ముందుగా సదరు ప్రచురణ కర్త రెవెన్యూ డివిజనల్ అధికారి లేదా సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ముందు ఒక డిక్లరేషన్ దాఖలు చేయాలి. సదరు డిక్లరేషన్‌లో అతడు తన పత్రికను ఏ ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించబోతున్నారో దాని చిరునామాను స్పష్టంగా ఉదహరించాలి. సొంతంగా ప్రెస్ ఏర్పాటు చేసినట్లయితే దానిని సంబంధిత ప్రాంతపు తహాశీల్దార్ పూర్తిగా పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉన్నట్లుగా నిర్ధారించి ఆర్డీఓకు సిఫారసు చేయాలి. అలా లేని పక్షంలో వేరే ప్రెస్‌లో ముద్రించేటట్లయితే ఆ ప్రెస్‌కు తొలుత ఆర్డీఓ నుండి లైసెన్స్ మంజూరు కాబడి ఉండాలి. అంతేగాక ప్రింటింగ్ ప్రెస్ యజమాని, ప్రచురణకర్తల మధ్య స్పష్టమైన అగ్రిమెంట్ ఉండాలి. కానీ విశాఖ నగరంలో ఉన్న అధిక శాతం ప్రింటింగ్ ప్రెస్‌లు ఈ నియమాలను పాటించడం లేదు. అలాగే ప్రచురణకర్తలు కూడా ఈ నిబంధనను ఉల్లంఘించి తమకు అనుకూలమైన చోట తమకు వీలైనప్పుడు ముద్రణ కొనసాగిస్తున్నారు. ప్రచురణ కర్తలు, ప్రచురణలను పద్ధతి ప్రకారం ఆర్డీఓకు సమర్పించాలి. వాటిని వారు రికార్డు చేయాలి. అలా సమర్పించని ప్రచురణలను తగిన విధంగా పరిశీలించి వాటిని తదుపరి కొనసాగనివ్వకుండా నిలిపివేసే అధికారం ఆర్డీఓకు ఉంది. అంతేకాకుండా డిక్లరేషన్‌కు విరుద్ధంగా ఇతర చిరునామాలను వినియోగించే ప్రచురణ కర్తలను విచారించి వారికి జైలు శిక్ష విధించే అధికారం కూడా ఆర్డీఓకు ఉంది. కానీ ఈ విషయంలో రెవెన్యూ అధికారులు ఉదాశీనంగా వ్యవహరిస్తున్న కారణంగా తామర తంపరలుగా ప్రింటింగ్ ప్రెస్‌లు, పత్రికలు, ప్రచురణకర్తలు, విలేఖరులు పుట్టుకువస్తున్నారు.

తాజాగా జీవీఎంసీ అధికారులు తిరస్కరించిన బాణాసంచా దుకాణదారులు కూడా నిర్భయంగా దుకాణాలు, బాణసంచా గోదాములు, నిర్వహిస్తున్నారు. అలాగే అనేకచోట్ల ప్రమాదకరమైన పెయింట్ల గోదాములు, రసాయనాల గోదాములు, త్వరగా మండిపోయే ప్లాస్టిక్ వంటి పదార్థాలు నిలువచేసే గోదాములు, ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేశారు. వీటివలన అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నప్పటికీ తగిన చర్యలు తీసుకోబడటం లేదు. ముఖ్యంగా ట్రాన్స్‌పోర్టు కంపెనీలు తమకు అనుకూలమైన ప్రదేశాల్లో గోదాములు ఏర్పాటు చేసుకొని ఇతరులకు ఎంతో అసౌకర్యం కల్గిస్తున్నాయి. సదరు యజమానులు ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే ఎక్కడికక్కడే తమ కార్యకలాపాలు నిర్వర్తిస్తున్నారు. అదేవిధంగా రోడ్డు వారన నిర్వహించే ఏ హోటల్‌కు జీవీఎంసీ నుండి అనుమతులు లేవు. అంతేకాకుండా ఈ హోటళ్ల వద్ద ఆహారం తినే కష్టమర్లు తమ వాహనాలను రోడ్డు మధ్యన నిలిపివేసి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కల్గిస్తున్నారు.

ప్రజలు కూడా ఇటువంటి విషయాలలో తమవంతు బాధ్యతగా ఫిర్యాదులు చేసినప్పుడే అధికారులు సమస్యను అర్థం చేసుకొని పరిష్కరిస్తారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఇటువంటి విషయాలను నియంత్రించడం అధికారులకు కూడా కష్టమే.


**PUBLIC NOTICE**

This is to inform you all that, few unauthorized person are using our company's letter head, seal, Money Receipt, Sale & Purchase bills, Voucher etc illegally. We have not issued such kind of documents to any one on behalf of our company. Hence, if anybody will entertain them, it will be at their own risk. Our company will not be responsible for any kind of misuse for the same.

**Udayakar Sahoo**

Managing Partner, M/S Mayine Ferro LLP Unit-2, Vill: Namakkal, Taluk-Bommanhall, Dist-Anantapur, Andhra Pradesh -515871


### పురందేశ్వరి మద్యం బ్రాండ్లను టేస్ట్ చేస్తున్నట్టున్నారు

ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరిపై ఏపీ మంత్రి అప్పలరాజు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఏపీలో మద్యం అమ్మకాలపై కొన్ని రోజులుగా పురందేశ్వరి తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. అప్పలరాజు స్పందిస్తూ... పురుందేశ్వరి ప్రతి రోజు మద్యం బ్రాండ్లను టేస్ట్ చేస్తున్నారేమో అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. తాను మద్యం తాగనని, తనకు మద్యం టేస్ట్ లపై అవగాహన లేదని చెప్పారు. ఇప్పుడు ఉన్న మద్యం బ్రాండ్లన్నీ చంద్రబాబు హయాంలో వచ్చినవేనని చెప్పారు.

## కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో తప్పులు లేని సమగ్ర ఓటరు జాబితా రూపొందించాలని , ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా డూప్లికేట్ ఓట్లను తొలగించే క్రమంలో జాగ్రత్త వహించాలని ఒకటికి రెండు సార్లు పరిశీలించుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ సూచించారు. ఒకే డోర్ నెంబర్లో అధిక ఓట్లు ఉన్నా.. ఒకరి పేరు మీద రెండు ఓట్లు ఉన్నా బీఎల్వోలు స్వయంగా ఆయా ఇళ్లకు వెళ్లి పరిశీలించాలని చెప్పారు. అన్ని వివరాలు సరిపోయాయి అనుకున్నాకే ఓట్లను తొలగించాలన్నారు. డూప్లికేట్ ఓట్ల తొలగింపులో సంబంధిత ఓటరు నుంచి సమ్మతి తీసుకోవాలని స్పష్టం చేశారు. చిరునామా మారినా లేదా వలస వెళ్లిపోయినా వారి వివరాలను కచ్చితంగా తెలుసుకోవాలని అనంతరం తదుపరి చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. బీఎల్వోలు ఓటు సవరణలు ఈఆర్వో 2.0 ద్వారా ఆన్లైన్ లో తప్పక అప్లోడ్ చేయాలన్నారు.

శుక్రవారం సాయంత్రం గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల ముసాయిదా జాబితా పై అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వోలు, సూపర్ వైజర్లతో వివిఎంఆర్డిఏ బాలల ప్రాంగణం లో అవగాహన సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ ప్రకారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు అంశాలపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా నియోజకవర్గ, మండల వారీగా ఉన్న జంక్, సున్నా డోర్ నెంబర్ ఓట్లు ఎన్ని గుర్తించారు, అందులో ఉన్న ఓటర్ల సంఖ్య ఎంత, ఎన్ని కేసులు పరిశీలించారు, ఎన్నింటిని సరి చేశారు, డోర్ నెంబర్ వారీగా ఫామ్-8 ఎంత మంది వద్ద తీసుకున్నారు, ఇంకా ఎంత తీసుకోవాల్సి ఉంది తదితర అంశాలపై సమీక్షించారు. ఒకే ఇంటిలో పది మంది కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న కేసులు, 100 సంవత్సరాలు పైబడిన వారి కేసులు ఎన్ని, పరిశీలించినవి ఎన్ని, ఇంకను పరిశీలించాల్సిన సంఖ్య తదితరాలపై తాసిల్దార్లతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఓటర్ల జాబితా సవరణలో, డూప్లికేట్ ఓట్ల తొలగింపులో అనుసరించాల్సిన నియమ నిబంధనల గురించి వివరించారు. ఎన్నికల కమిషన్ నియమావళిని అందరూ తప్పకుండా జాబితా రూపకల్పనలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. చిన్న తప్పు కూడా లేకుండా అత్యంత పారదర్శకతతో కూడిన తుది ఓటర్ల జాబితాను ప్రచురించేందుకు అందరూ కృషి చేయాలని జేసీ పిలుపునిచ్చారు.

సమావేశంలో డీఆర్వో కె. మోహన్ కుమార్, ప్రత్యేక ఉప తహసీల్దార్ లక్ష్మారెడ్డి , తహశీల్దార్లు, బీఎల్వోలు, సూపర్ వైజర్లు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో తీవ్ర దుర్భిక్షం : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



**విజయవాడ, (విశాఖ సమాచారమ్):** అంధ్రప్రదేశ్లోని 18జిల్లాల్లో తీవ్రమైన కరవు నెలకొందనీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. విజయవాడలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వివిధ జిల్లాల్లో తమ ప్రతినిధులు పర్యటించినట్లు తెలిపారు.

రాష్ట్ర విభజన తర్వాత ఇంత దారుణమైన పరిస్థితి ఎదురు కాలేదని ఆయన అన్నారు.పంటలు వేయలేని దుస్థితి లో అన్నదాత ఉన్నట్లు చెప్పారు.440మండలాల్లో దుర్భరమైన పరిస్థితి ఉందనీ, ఆయకట్టు ప్రాంతంలో కూడా పంటలు లేవన్నారు.నీటి ప్రాజెక్టుల్లో నీరు లేక ఎకరాకు కూడా నీరివ్వడం లేదనీ తెలిపారు.

ముఖ్యమంత్రి మాత్రం అసలు కరవు గురించే మాట్లాడరని, అధికారులతో కరవు పై సమీక్ష కూడా చేయడం లేదన్నారు.వ్యవసాయ శాఖ మంత్రి ఎక్కడ దాక్కున్నాడనీ ఆయన ప్రశ్నించారు. రెవెన్యూ మంత్రి అసలు పత్తాలేడనీ చెప్పారు. కరవు ప్రాంతాల్లో మంత్రులు ఎందుకు పర్యటించరనీ ఆయన ప్రశ్నించారు. పంట నష్టం అంచనాలు వేసే వారెవరన్నారు. అధికారులు వై ఎపినీడ్స్ జగన్ కార్యక్రమం లో బిజీగా ఉన్నారనీ, జగన్ లాంటి ముఖ్యమంత్రి ఈ రాష్ట్రానికి అవసరమా? అని నిలదీశారు.క్యాబినెట్ లో కూడా కరవు పై చర్చ చేయకపోవడం దుర్మార్గం కాదా? అని ఆయన విమర్శించారు.రాయలసీమ నుంచి వలసలు పోతున్నా పట్టించుకోవడం లేదని, ఈ రాష్ట్రానికి జగన్ ఎంతమాత్రం అవసరం లేదనీ రామకృష్ణ స్పష్టం చేశారు.ప్రజలను, రైతులను పట్టించుకోని జగన్ వద్దని ప్రజలు డిసైడ్ అయ్యారనీ, కృష్ణా జలాల విషయంలో ప్రధాని ఎపికి అన్యాయం చేశారనీ తెలిపారు. తెలంగాణ ఎన్నికలలో లబ్ది కోసమే ఈ గెజిట్ నోటిఫికేషన్ ఇక్సినట్లు చెపుతూ జగన్ మాట్లాడలేని దద్దమ్మ కాబట్టే ఎపికి పదే పదే అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఈనెల 20, 21తేదీలలో 30 గంటల పాటు నిరసన కార్యక్రమం విజయవాడ లో చేపడతామని రామకృష్ణ పేర్కొన్నారు.

## కాఫీ కల్లాలకు నగదు జమ చేయడంలో జాప్యం ఎందుకు



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** గిరి రైతులు నిర్మించుకున్న కాఫీ కల్లాలకు కాఫీ బోర్డు వారు నగదు జమ చేయడంలో జాప్యం చేయడానికి కారణం ఏమిటో అర్థం కాక గిరి రైతులు లబోదిబోమంటున్నారని సిపిఐ పార్టీకి చెందిన ఎర్ర బొమ్మల ఎంపీటీసీ సభ్యుడు సెగ్గె సత్తిబాబు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గిరి రైతులను ఆర్థికంగా ఆదుకునే క్రమంలో భాగంగా కాఫీ రైతులకు సంబంధించి కాఫీ కల్లాలు (400 అడుగుల) నిర్మించుకున్న రైతులకు 22,500 రూపాయలు చెల్లిస్తామన్న కాఫీ బోర్డ్ యాజమాన్యం, గిరి రైతులు కల్లాలు నిర్మించుకొని నేటికీ మూడు నెలలు కావస్తున్న చెల్లించలేదన్నారు. ఇదే క్రమంలో గత ఏడాది ఒక్కొక్క రైతుకు 225 చొప్పున కాఫ మొక్కలు సరఫరా చేసిన కాఫీ బోర్డు అందుకు సంబంధించిన నగదును కూడా రైతులకు జమ చేయలేదన్నారు. అదేవిధంగా గిరి రైతులు శ్రమకోర్చి సేకరించిన కాఫీ పండ్లకు గిట్టుబాటు ధర చెల్లించకుండా రైతు నిర్ణయించిన ధర కాకుండా కాఫీ బోర్డే కిలో 43 రూపాయలగా నిర్ణయించి కొనుగోలు చేయడం భావ్యం కాదన్నారు. కనీసం 50 రూపాయలు కూడా గిట్టకపోవడం బాధాకరమన్నారు. గిరి రైతులను ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సహకరించవలసిన కాఫీ బోర్డ్ ఆ విధంగా ఆలోచన చేయకపోవడం గిరి రైతులను మోసగించడమేనని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కాఫ పండ్లకు గిట్టుబాటు ధర కల్పించి గిరి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

## దాడి రత్నాకర్ సొంత నిధులతో పశు వైద్యాలయానికి మరమ్మత్తులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ విలీనగ్రామం కొండకొప్పాకలో ఇటీవల వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ పర్యటించారు. దీనిలో భాగంగా గ్రామంలోని పశు వైద్యాలయంను సందర్శించారు. అయితే పశువైద్యాలయ భవనం, గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి అనే విషయాన్ని రత్నాకర్ గమనించారు. భవనం చుట్టుఉన్న గోడలు పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడడంతో భవనంలోకి పాములు ఇతర క్రిమికీటకాలు ప్రవేశిస్తున్నాయి. దీంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అలాగే భవనం యొక్క శ్లాబ్‌కు పూర్తిగా ధ్వంసం కావడంతో శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయని, దీంతో భవనంలో ఉండడానికి భయాందోళనకు గురవుతున్నామని పశువైద్యశాల సిబ్బంది రత్నాకర్‌కు వివరిరంచారు. దీంతో స్పందించిన రత్నాకర్ తన సొంత నిధులు వెచ్చించి గోడలకు ప్లాసింగ్‌లు, భవనంలోపల శ్లాబ్‌కు ఇతర మరమ్మత్తులను తక్షణమే చేయించారు. దీంతో సిబ్బంది. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామంలోగల అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్యాన్లు, లైట్లు లేక పడుతున్న ఇబ్బందులను గమనించి దాడి రత్నాకర్ తన సొంతి నిధులతో కేంద్రంలో రెండు సీలింగ్ ఫ్యాన్లు, రెండు ట్యూబ్‌లైట్లను ఏర్పాటు చేయించారు. దీంతో సిబ్బంది మరియు పిల్లల తల్లిదండ్రులు రత్నాకర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఎక్స్ ఎం పి టి సి వామాల కాశి ఆధ్వర్యంలో పనులను చేయించారు.




# 11.5 కోట్ల పాన్ కార్డులను డీయాక్టివేట్ చేసిన కేంద్రం



పాన్ కార్డులను ఆధార్ తో లింకు చేసుకోవాలని కేంద్రం ఎప్పటి నుంచో చెబుతోంది. ఆ మేరకు పలుమార్లు గడువు పెంచుతూ వచ్చింది. పొడిగించిన గడువు కూడా ఈ ఏడాది జూన్ 30తో ముగిసింది. ఈ నేపథ్యంలో, 12 కోట్లకు పైగా పాన్ కార్డులు ఆధార్ తో అనుసంధానం కానట్టు కేంద్రం గుర్తించింది. వాటిలో 11.5 కోట్ల పాన్ కార్డులను డీయాక్టివేట్ చేసింది.

మధ్యప్రదేశ్ కు చెందిన చంద్రశేఖర్ గౌర్ అనే సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కార్యకర్త ఈ విషయమై కేంద్ర ప్రత్యక్ష పన్నుల విభాగం (సీబీడీటీ) నుంచి వివరణ కోరారు. చంద్రశేఖర్ గౌర్ దాఖలు చేసిన ఆర్టీఐ దరఖాస్తుకు సీబీడీటీ సమాధానమిచ్చింది.

నిర్ణీత గడువు లోపు ఆధార్ తో అనుసంధానం చేయని 11.5 కోట్ల పాన్ కార్డులను డీయాక్టివేట్ చేసినట్టు వెల్లడించింది. దేశంలో పాన్ కార్డులు కలిగి ఉన్న వారి సంఖ్య 70.24 కోట్ల మంది అని, అందులో 57.25 కోట్ల మంది ఆధార్ తో పాన్ కార్డును అనుసంధానం చేసుకున్నారని వివరించింది.

ప్రస్తుతం పాన్ కార్డు దరఖాస్తు సమయంలోనే ఆధార్ లింక్ చేస్తారు. 2017 జులై 1వ తేదీకి ముందు పాన్ కార్డు పొందిన వారికి ఆ సౌలభ్యం లేదు. వారు తమ పాన్ కార్డుకు ఆధార్ లింక్ చేసుకోవడం తప్పనిసరి.

# పాఠశాలలకు 3 రోజులు సెలవులు




ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో రేపటి నుంచి మూడు రోజుల పాటు స్కూళ్లకు సెలవులు ఉండనున్నాయి. రేపు రెండో శనివారం, 12న ఆదివారం, 13న దీపావళి సెలవు కావడంతో మూడు రోజులు సెలవులు ఉండనున్నాయి. తొలుత దీపావళి సెలవు నవంబర్ 12న ఉండగాచి. ప్రభుత్వం దాన్ని 13వ తేదీకి మారుస్తూ జీవో ఇచ్చింది. ఇక అటు రైళ్లలో టపాసులు తీసుకె ళ్లే వారికి రైల్వేశాఖ హెచ్చరికలు జారీచేసింది. రైల్వే స్టేషన్లు, ట్రైన్ లలో క్రాకర్స్ తీసుకెళ్తూ దొరికితే రూ. 1000 ఫైన్ లేదా మూడేళ్ల జైలు శిక్ష ఉంటుందని తెలిపింది.

# సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహ ఆవిష్కరణ



దివంగత నటుడు, సూపర్ స్టార్ కృష్ణ విగ్రహాన్ని మరో సూపర్ స్టార్ కమలహాసన్ విజయవాడలో ఆవిష్కరించారు. నగరంలోని గురునానక్ కాలనీలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాశ్‌తో కలిసి కమలహాసన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అవినాశ్ మాట్లాడుతూ.. తెలుగు ప్రజల అభిమాన నటుడు కృష్ణ విగ్రహాన్ని విజయవాడలో ఆవిష్కరించినందుకు చెప్పలేనంత ఆనందంగా ఉందన్నారు.ఆయన వారసుడు మహేశ్‌బాబు సినీ రంగంలో తనదైన ముద్ర వేయడంతోపాటు సేవా రంగంలోనూ ముందున్నారని కొనియాడారు. షూటింగ్స్‌తో నిత్యం బిజీగా ఉండే కమలహాసన్ విజయవాడ వచ్చి కృష్ణ విగ్రహన్ని ఆవిష్కరించినందుకు సంతోషంగా ఉందని, విజయవాడ ప్రజలు, కృష్ణ, మహేశ్‌బాబు అభిమానుల తరపున ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్టు చెప్పారు.

# పాక్‌లో ముష్కరులకు కంటిమీద కునుకు కరువు




ఢిల్లీ: ఒకప్పుడు అమాయకుల హత్యలకు కుట్రలు పన్ని భయోత్పాతం సృష్టించిన పాక్ ఉగ్రవాదులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. పాక్‌లో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వరుసగా వారిని హత్య చేస్తుండటంతో.. చాలా మంది రహస్య ప్రదేశాల్లో దాక్కుంటున్నారు. తాజాగా పాక్‌లోని లష్కరే తోయిబా ఉగ్రనేత అక్రమ్ ఖాన్ ఘాజీని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. దాదాపు 20 నెలల్లో హత్యకు గురైన 19వ ఉగ్రవాది ఇతడు.

**ఆసుపత్రివద్ద పోరు :** అక్రమ్ ఖాన్ 2018-2020 మధ్యలో లష్కరే తోయిబా ఉగ్ర సంస్థకు అవసరమైన నియామకాలు చేపట్టేవాడు. గత రెండేళ్లుగా కశ్మీర్ లోయలోకి చొరబడుతున్న ఉగ్ర బృందాలకు ఇతడు భారత్‌పై విద్వేషపూరిత పాఠాలు చెబుతున్నాడు. నేడు ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లో బజార్ జిల్లాలో బైకుపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అక్రమ్ ఖాన్‌ను కాల్చి చంపినట్లు ఆంగ్లపత్రిక టైమ్స్ ఆఫ్ ఇండియా పేర్కొంది. ఈ విషయాన్ని వీలైనంత వరకు బయటకు రాకుండా చూడాలని పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ ప్రయత్నించినట్లు తెలిపింది.

ఈ హత్యతో అప్రమత్తమైన పాక్ దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగాయి. స్థానిక ప్రత్యర్థులు, ఇతర ఉగ్ర గ్రూపుల పాత్ర, లష్కరేలో అంతర్గత విభేదాలు వంటి కోణాలను పరిశీలిస్తున్నారు. గత మూడునెలల్లో లష్కరేకు చెందిన టాప్ కమాండర్లు హతం కావడం ఇది రెండోసారి. సెప్టెంబర్‌లో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని రావల్‌కోట్‌లో ఒక మసీదు బయట లష్కరే సీనియర్ కమాండర్ రియాజ్ అహ్మద్‌ను కాల్చి చంపారు. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ నియంత్రణలోనే లష్కరే సంస్థ పనిచేస్తుందన్న విషయం తెలిసిందే. ఈ వారంలో హత్యకు గురైన షాహిద్ ఖ్వాజా కూడా లష్కరే ఉగ్రవాదే. ఇతడు 2018న భారత్‌లో సుంజ్వాన్ సైనిక క్యాంప్‌పై దాడికి సూత్రధారి.

ఈ వరుస హత్యల్లో ఉగ్రసంస్థ జైషే మహమ్మద్‌కు కూడా భారీ దెబ్బలు తగిలాయి. గత నెలలో జైషే చీఫ్ మసూద్ అజర్‌కు అత్యంత సన్నిహితుడైన దావుద్‌మాలిక్‌ను నార్త్ వజీరిస్థాన్‌లో పట్టపగలు గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిచంపారు. ఇక హిజ్బుల్ చీఫ్ హఫీజ్ సయీద్ సన్నిహితుడు ముఫ్తీ ఖైజర్ ఫారుఖీని కరాచీ నడిబొడ్డున హత్య చేశారు. ఈ ఘటన లష్కరే ఉగ్ర సంస్థకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. ఐసీ-814 విమానం హైజాక్‌లో కీలక పాత్ర పోషించిన జైషే ఉగ్రవాది మిస్త్రీ జహూర్ ఇబ్రహీంను కూడా పాయింట్ బ్లాంక్ రేంజిలో కాల్చి చంపారు. ఈ వరుస ఘటనలు పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐను ఉక్కిరిబిక్కిరి చేశాయి. పదుల సంఖ్యలో ఉగ్రవాదులను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. ఇక మే నెలలో ఖలిస్థానీ కమాండో ఫోర్స్ అధినేత పరంజీత్ సింగ్ పన్వార్‌ను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు లాహోర్‌లో కాల్చిచంపారు. జైషే ఉగ్ర సంస్థ ఆత్మాహుతి దాడి బృందానికి చీఫ్ హ్యాండిలర్‌గా ఉన్న షాహిద్ లతీఫ్‌ను అక్టోబర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. ఇతడి బృందమే పంజాబ్‌లోని పఠాన్‌కోట్ ఎయిర్ బేస్‌పై దాడిచేసింది.

# ఎంపి, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులను త్వరగా విచారించాలి - హైకోర్టులకు సుప్రీం ఆదేశం



**న్యూఢిల్లీ:** ప్రజా ప్రతినిధులపై నమోదైన తీవ్రమైన నేరాల (క్రిమినల్ కేసులు) విచారణలను వేగంగా పూర్తి చేసేందుకు కచ్చితమైన, ఏకరీతి మార్గదర్శకాలు రూపొందించడం క్లిష్టమైన ప్రక్రియ అని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అటువంటి కేసులను సమర్థవంతంగా పర్యవేక్షించడానికి చర్యలు తీసుకునే బాధ్యతను హైకోర్టులకు అప్పగించింది. తీవ్రమైన నేరాలకు పాల్పడిన ఎంపి, ఎమ్మెల్యేలు ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాలం నిషేధించాలని న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ప్రజా ప్రతినిధులపై దాఖలైన క్రిమినల్ కేసులను త్వరితగతిన విచారించాలని హైకోర్టులను ఆదేశించింది. పెండింగ్‌లో ఉన్న

## ట్రయల్ కోర్టు విచారణను వాయిదా వేయకూడదు

కేసుల సత్వర విచారణ కోసం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన లేదా ప్రధాన న్యాయమూర్తి నియమించిన ధర్మాసనం ప్రత్యేక బెంచీలను ఏర్పాటు చేయాలని, కేసులను జాబితా చేయాలని పేర్కొంది. ఈ కేసులు ఏడాది లోపే పరిష్కరించాలని హైకోర్టులను ఆదేశించింది. క్రిమినల్ కేసుల సత్వర విచారణకు అవసరమైన పర్యవేక్షణ కోరుతూ సుమోటో కేసులు నమోదు చేయాలని హైకోర్టులను ధర్మాసనం ఆదేశించింది.

ట్రయల్ కోర్టులు అత్యవసరమైతే తప్ప ప్రజాప్రతినిధులపై నమోదైన కేసుల విచారణలు వాయిదా వేయకూడదని సుప్రీం ఆదేశాల్లో పేర్కొంది. కేసుల సత్వర పరిష్కారానికి వెబ్‌సైట్‌ను సిద్ధం చేయాలని ఆదేశించింది. కేసుల వివరాలను జిల్లా, ప్రత్యేక న్యాయస్థానాల నుంచి సేకరించి హైకోర్టు వెబ్‌సైట్‌లో ప్రత్యేక ట్యాబ్ ఏర్పాటు చేసి అందులో పొందుపరచాలని హైకోర్టులకు సూచించింది. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సాంకేతికతను జిల్లా న్యాయస్థానాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించింది. దోషిగా తేలిన ఎంపి, ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాల నిషేధంపై విచారణ జరుపుతామని, ఈ అంశంపై ఇప్పటివరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది.

# పెద్ద నోట్ల రద్దు అనంతర పరిస్థితిపై సర్వే



**న్యూఢిల్లీ:** 2016 నవంబర్ 7న మోదీ ప్రభుత్వం రూ.500, రూ.1000 నోట్ల చలామణిని రద్దు చేసింది. నల్లధనాన్ని వెలికితీసేందుకే ఈ చర్య తీసుకున్నామంటూ వివరణ ఇచ్చింది. ఆ తర్వాత నగదు లావాదేవీలను తగ్గించడానికి యూపీఐ, ఇతర డిజిటల్ చెల్లింపుల పద్ధతులను ప్రవేశపెట్టింది. అయినప్పటికీ గత ఏడు సంవత్సరాల్లో దేశంలో నగదు చలామణి రెట్టింపు అయింది. 2016 నవంబరులో రూ.17 లక్షల కోట్ల నగదు చలామణిలో ఉండగా ఈ ఏడాది అక్టోబర్‌లో అది రూ.33 లక్షల కోట్లకు పెరిగిందని ఓ సర్వేలో వెల్లడైంది. మేలో దేశ మొత్తం రిటైల్ డిజిటల్ చెల్లింపుల్లో 78 శాతానికి పైగా యూపీఐ ద్వారానే జరిగాయి. అయినప్పటికీ గత ఏడేళ్లలో ఆస్తులు కొనుగోలు చేసిన వారిలో 76 శాతం మంది కొంత మొత్తాన్ని నగదు రూపంలోనే చెల్లించారు. యూపీఐ ద్వారా రూ.17.6 లక్షల కోట్ల విలువైన 1,140 కోట్ల లావాదేవీలు జరిగినప్పటికీ సర్వేలో పాల్గొన్న 15శాతం మంది తాము 50శాతం వరకూ చెల్లింపులను నగదు రూపంలోనే చేశామని చెప్పారు. 18శాతం మంది 30శాతం-50శాతం నగదు చెల్లింపులు జరపగా, 15శాతం మంది 0-10శాతం వరకూ నగదు రూపంలో చెల్లించామని తెలిపారు. వాహనాలు, ఎలక్ట్రానిక్ పరికరాల కొనుగోలుకు మినహా చాలా మంది తమ కుటుంబ అవసరాలకు నగదు చెల్లింపులే జరుపుతున్నారు. 26 శాతం మంది భారతీయులు నిత్యావసరాల కొనుగోలుకు నగదు చెల్లింపుల పైనే ఆధారపడుతున్నారు. 11,189 మంది పౌరుల్లో కేవలం 15 శాతం మంది మాత్రమే నగదు లావాదేవీలు జరపడం లేదు. గత సంవత్సర కాలంలో ఏడు శాతం మంది దీర్ఘకాలిక ఆస్తులతో పాటు బంగారం, వాహనాల కొనుగోలుకు నగదే చెల్లించారు.

# రక్త దానం చేయండి- ప్రాణాలు కాపాడండి

## 70 యూనిట్ల రక్త సేకరణ



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** రక్తదానంతో ప్రమాదంలో ఉన్న రోగుల ప్రాణాలు కాపాడాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఎఎస్ఆర్ బ్రాంచి వారి సౌజన్యంతో ఎపి రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలక్టర్ ప్రోత్సాహంతో కలక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన రక్తదాన శిభిరాన్ని కలక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్యవంతులందరూ రక్త దానం చేయాలని, రక్త దానం వల్ల ఎటువంటి అనారోగ్య ఫలితాలు జరగవని, ఆరోగ్యవంతులు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని వివరించారు. ఈ రక్త దాన శిభిరంలో పాడేరు డివిజనులోని ఎనిమిది మండలాల రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఈ

శిబిరంలో సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్ నుంచి 20 మంది జవాన్లు, పాడేరు డిగ్రీ కళాశాల నుండి 15 మంది విద్యార్థులు రక్తదానంలో పాల్గొని వారి సేవా దృక్పదాన్ని చాటుకొన్నారు. జిల్లా కలక్టర్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ వారికి జిల్లా కలక్టర్ చేతులు మీదుగా సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ శిభిరంలో 70 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాడేరు ఎంపిడిఓ నవీన్, ఎపి రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అద్యక్షుడు బి. చిన్నికృష్ణ, సెక్రటరీ వి.త్రినాధ్ రావు నాయుడు, ఉపాధ్యక్షుడు కె. అప్పలస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఒ. ప్రశాంత్ కుమార్, ట్రెజరర్ వి. చంద్రశేఖర్, రెడ్ క్రాస్ సభ్యులు డా. జి.రూప కళ, కె. సింహాచలం, వి. లోహితాస్, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ విగ్రహావిష్కరణ



**పాడేరు/పెదబయలు, (విశాఖ సమాచారమ్):** బొంగరం పంచాయతీ బొంగరం గ్రామం లో ఆంధ్ర వనవాసి కళ్యాణ్ ఆశ్రమం ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ హనుమాన్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించడం,ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా ఆంధ్ర వనవాసి కళ్యాణ్ ఆశ్రమం రాష్ట్ర ప్రతి నిధి విద్యాధర్ మహంతి, విశిష్ట అతిధిగా బీజేవైఎం అరకు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి మత్స్య కొండ బాబు పాల్గొన్నారు, అనంతరం వారు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో హిందూ ధర్మం ను కాపాడు కోవటానికి ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని పిలుపు నిచ్చారు, సర్వేజనా సుఖినో భవంతు అంటూ ప్రజలందరి క్షేమం కోరేది కేవలం హిందూ ధర్మం మాత్రమే అని వారు స్పష్టం చేశారు,అంతకు ముందు వేద మంత్రాల నడుమ గ్రామస్తులతో వాళ్ళు కలిసి హనుమాన్ విగ్రహ ప్రతిష్ట కు ప్రత్యేక పూజ, హోమం నిర్వహించారు, ఈ సందర్భంగా గత రెండు నెలలు క్రితం ఢిల్లీ లో 99 టీవీ ఆధ్వర్యంలో రాష్ట్ర పతి చేతుల మీదుగా నారి శక్తి అవార్డు అందుకున్న వనవాసి కళ్యాణ్ ఆశ్రమం మహిళా ప్రతి నిధి కిముడు అచ్చమ్మ కు, అలాగే వనవాసి రాష్ట్ర ప్రతి నిధి విద్యాధర్ మహంతి లకు శాలువాలు కప్పి ఘన సన్మానం చేశారు, విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా గ్రామం లో నిర్వహించిన అన్న సంతర్పణ కార్యక్రమం లో పంచాయతీ ప్రజలందరూ పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు, ఈ కార్యక్రమం లో పంచాయతీ సర్పంచ్ వుడ్డు లక్ష్మి పతి, వనవాసి కళ్యాణ్ ఆశ్రమం ప్రతి నిధులు రామకృష్ణ, శుభద్ర మత్యకొండ బాబు, పుష్ప, గ్రామ పెద్ద లు నాగం నాయుడు, పొట్టి నాయుడు (మునసబు ), గణపతి, విజయ్, మాజీ సర్పంచ్ ప్రసాద్ నాయుడు, ప్రసాద్ రావు, తిరుపతి రావు, చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల బరిలో ప్రభుత్వ వైద్యుడు

## ఓడిపోతే తిరిగి ఉద్యోగంలోకి

జైపుర: ఓ ప్రభుత్వ వైద్యుడు రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆ రాష్ట్ర హైకోర్టు అనుమతించింది. అతడు ఒక వేళ ఓడిపోయినట్లయితే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ అధికారులకు సూచించింది. అక్టోబరు 20న ఆ మేరకు జస్టిస్ పుష్పేంద్రసింగ్ భాటి నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. '2023 రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొనడం కోసం పిటిషనర్‌ను మెడికల్ ఆఫీసర్ పదవి నుంచి తప్పించమని ప్రతివాదులను ఆదేశిస్తున్నాము. పిటిషనర్‌ను ఎన్నికల్లో పోటీచేయడానికి అనుమతించండి. ఒక వేళ పిటిషనర్ ఓడిపోతే ప్రతివాది తదుపరి ఆదేశాలు జారీ చేయొచ్చు. ఆ విధంగా వైద్యాధికారి పోస్టులో తిరిగి చేరేందుకు పిటిషనర్‌కు అనుమతి లభిస్తుంది' అని కోర్టు ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొంది.

దాంతో ఆ వైద్యుడు ఎవరనే విషయంపై ఆసక్తి నెలకొంది. 43 ఏళ్ల వయసున్న దీపక్ ఘోఘ్రా దుంగార్‌పుర్ ప్రభుత్వ ఆస్పత్రిలో గత పదేళ్లుగా గైనకాలజిస్టుగా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు ఆ ఆస్పత్రిలో సుమారు 20వేల ప్రసవాలు చేశారు. దాంతోపాటు విద్యార్థులకు కావాల్సిన పుస్తక సామగ్రిని బాక్సుల్లో పంచుతూ 'బాక్స్ మ్యాన్'గానూ ప్రజల్లో పేరు సంపాదించారు. దీపక్ ఘోఘ్రాకు ప్రజల్లో ఉన్న గుర్తింపును దృష్టిలో ఉంచుకొని భారతీయ ట్రైబల్ పార్టీ (బీటీపీ) దుంగార్‌పుర్ టికెట్ ఇచ్చింది. దాంతో ఆయన మెడలో స్టెతస్కోప్ వేసుకొని మరీ ప్రచారం నిర్వహిస్తున్నాడు. బీటీపీ మొత్తం 17 మంది అభ్యర్థులను పోటీలో నిలిపింది. వారిలో ఇద్దరు వైద్యులున్నారు.

ప్రభుత్వ వైద్యుడు ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయినా తిరిగి విధుల్లో చేరేందుకు హైకోర్టు అనుమతించడం పట్ల దీపక్ సంతోషం వ్యక్తం చేశారు. 'ఇదో మైలురాయిలాంటి తీర్పు. దీనిని అనుసరించి మరింత మంది వైద్యులు ముందుకొస్తారని' వ్యాఖ్యానించారు. ప్రజలకు సేవ చేసేందుకు ఉన్నత విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలని కోరారు. ప్రజా క్షేమం కాంక్షించే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రజలందరికీ తెలిసిన వ్యక్తిని కావడంతో తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దుంగార్‌పుర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే గణేశ్ ఘోఘ్రా, భాజపా తరఫున బన్సీలాల్ కటారా బరిలో ఉన్నారు. ఈ నెల 25న రాజస్థాన్‌లో పోలింగ్ జరగనుంది. డిసెంబరు 3న ఫలితాలు వెలువడనున్నాయి.

# డైట్ లో ఎన్నో వేటివ్ ఎంటర్ పెన్యూర్షిప్‌పై సదస్సు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక డైట్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇన్నోవేటివ్ ఎంట్రప్రెన్యూర్షిప్ పై డైట్ స్టూడెంట్ చాప్టర్ ఇన్స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు.

ఈ సదస్సు ద్వారా సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు తమ రంగంలో నైపుణ్యం పెంచుకుని తద్వారా తమ సృజనాత్మకత తో ఎంట్రప్రెన్యూర్స్ గా తమ భవిష్యత్తును నిర్దేశించుకోవచ్చు.

రిసోర్స్ పర్సన్ మద్ది గంగాధర్ గుప్తా ఈ సదస్సులో మాట్లాడుతూ ఎంట్రప్రెన్యూర్ అవ్వాలి అంటే ఎలాంటి గుణగణాలు ఉండాలి, ఎలాంటి ఆటిట్యూడ్ ఉండాలి, ఎక్కువ ఇన్నోవేటివ్ గా ఎలా ఆలోచించాలి అని సవివరంగా తెలియజేసారు. ప్రస్తుతం సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇన్నోవేషన్



మరియు స్టార్ట్ అప్ ల పైన ఎన్నో ఫండింగ్ అవకాశాలు ఉన్నాయని, దీని ద్వారా దేశం గర్వించ దగ్గ ఉన్నత ఆవిష్కరణలు సాధించవచ్చు అని తెలిపారు. ప్రస్తుతం మన దేశ ప్రధాన మంత్రి గారు ప్రవేశ పెట్టిన స్టార్ట్ అప్ ఇండియా - స్టాండ్ అప్ ఇండియా అను కార్యక్రమం ద్వారా అందిస్తున్న ఆర్థిక సహకారాల గురుంచి మరియు ఆలోచనలను ఆవిష్కరణలు గా తీరిచిదిద్దుకోవటానికి కావాల్సిన సమాచారాన్ని సవివరంగా తెలియజేసారు. ఈ సందర్భంగా ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కే.పార్వతి మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక నైపుణ్యతను విద్యార్థి దశ లోనే పెంపొందించుకోవాలని ఇన్నోవేషన్ యొక్క ఆవశ్యకతను గురుంచి వివరించి, ఇందుకు అనుగుణంగా భవిష్యత్తులో ఎంట్రప్రెన్యూర్షిప్ వర్క్ షాప్ లను నిర్వహిస్తామని అన్నారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ఏ. దేవి ప్రసాద్ సివిల్ ఇంజనీరింగ్ ఈరోజుల్లో ఉద్యోగం చేయడం గొప్ప కాదు సృష్టించడమే గొప్ప అని దానికి కావాల్సిన స్కిల్స్ గురించి మాట్లాడారు. డైట్ స్టూడెంట్ చాప్టర్ కన్వీనర్ వై హేమంత్ కుమార్ మాట్లాడుతూ ఇంటర్ప్రెన్యూర్ ఆలోచన విధానం ద్వారా భవిష్యత్తు లో స్టార్టుప్స్ మరియు కంపెనీ లు స్థాపించి దేశానికీ ఎంతో ఉపయోగపడేలా ఉండాలి అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ అకాడెమిక్స్ ఏ. కృష్ణ నాగ్ సివిల్ ఇంజనీరింగ్ విభాగ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో రోడ్డు ప్రమాదాలకు కళ్లెం వేసిన అధికారులు

సత్యం, (విశాఖ సమాచారమ్): రాష్ట్రంలో రహదారులు రక్తసిక్తమవుతూనే ఉన్నాయి. వెళ్లొస్తా అని చెప్పి.. తిరిగి రాకుండానే పోతున్నవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఆరున్నర శాతం మేర మరణాలు పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గుంతలుపడిన రోడ్లు, నిర్వాహణలోపం, ప్రభుత్వం నిర్లక్ష్యం వెరసి ప్రమాదాల సంఖ్యను మరింత పెంచుతున్నాయి.

విశాఖపట్నం నగరంలో గత ఏడాదితో పోలిస్తే 2022లో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయి. భారత ప్రభుత్వంలోని రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన "2022లో భారతదేశంలో రోడ్డు ప్రమాదాలు" అనే పేరుతో ఇటీవలి నివేదికలో ఈ విషయం వెల్లడైంది.

రోడ్డు ప్రమాదాల నివారణకు వివిధ భద్రతా కార్యక్రమాల ద్వారా ప్రమాదాల రేటును 34.5% తగ్గించడం ద్వారా 10 లక్షల జనాభాతో, అతి తక్కువ ప్రమాదాలు జరుగుతున్న నగరాల్లో విశాఖపట్నం నగరం



అగ్రస్థానంలో ఉందని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ జి.సి. రాజరత్నం ఇక్కడ ఒక ప్రకటనలో తెలిపారు.

విశాఖపట్నం నగర పరిధిలో 2021లో నమోదైన ప్రమాదాల సంఖ్య 2,339. 2022లో అవి 1,531కి క్షీణించాయి. 2021లో అత్యధిక ప్రమాదాలు జరిగిన దేశంలోని 50 నగరాల్లో వైజాగ్ ఏడో స్థానంలో ఉండగా, 808 ప్రమాదాలను తగ్గించుకుని ఇరవై రెండో స్థానంలో నిలిచింది.

అదేవిధంగా, రోడ్డు ప్రమాద మరణాల సంఖ్య 368 (2021) నుండి 358 (2022)కి తగ్గింది మరియు ఇదే కాలంలో గాయపడిన వారి సంఖ్య 1533 నుండి 1288కి తగ్గింది. అత్యధికంగా అతివేగం కారణంగా ప్రమాదాలు జరిగాయి, మొత్తం కేసుల్లో ఇది 83.14%.

శనివారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన రోడ్డు భద్రతా కమిటీ సమావేశాల్లో ప్రమాదాలపై చర్చించి, విశ్లేషించామని, రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు, జంక్షన్‌ల అభివృద్ధి వంటి నివారణ చర్యలు చేపట్టామని రత్నం తెలిపారు. ప్రమాదాల సంఖ్యను తగ్గించడంలో పాత్ర.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఆర్టీసీ అధునాతన సాంకేతికత వినియోగం

నిత్యం ఆర్టీసీ బస్సులు ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చుతున్నాయి. ఈ క్రమంలో కొన్ని బస్సులు ప్రమాదాల బారిన పడుతున్నాయి. రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు ఆర్టీసీ సంస్థ ఏటా కోట్ల రూపాయల పరిహారం చెల్లిస్తోంది. అందుకే రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం.. ఆర్టీసీ సహకారంతో ముందడుగులు వేస్తోంది. ప్రమాదాలను ముందే పసిగట్టే సాంకేతికతను అందిపుచ్చుకుని బస్సుల్లో వినియోగిస్తోంది.

## 22వ వార్డులో వోటర్స్ వెరిఫికేషన్



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఎంపీ మరియు తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త అయిన ఎంవివి సత్యనారాయణ ఆదేశాల మేరకు 22 వార్డు అధ్యక్షులైన పీతల గోవింద్ ఆధ్వర్యంలో మంగాపురం కాలనీ తారా మసీద్ ఏరియాలో వోటర్స్ వెరిఫికేషన్ బిఎల్ఎఎస్‌కే కుదాభాష మరియు సచివాలయం కన్వీనర్స్ మరియు గృహ సారధులు నిర్వహించడం జరుగుచున్నది.

## శ్రీ క్షేత్రంలో ధాన్యలక్ష్మీకి పంచామృత అభిషేకాలు



విజయనగరం, (విశాఖ సమాచారమ్): ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రం లో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధాన్య లక్ష్మీకి పంచామృత అభిషేకాలు,అర్చన, ప్రత్యేక పూజలు గావించారు. వేదమంత్రాల నడుమ దేవాలయం అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు ,చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు సంయుక్తంగా ధాన్యలక్ష్మీకి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ ఉమాదేవి దంపతులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బస్సు యాత్రకు మద్దతుగా హేమ చందు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



పరవాడ, (విశాఖ సమాచారమ్): రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన బస్సు యాత్ర అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి లో మంత్రి గుడివాడ అమర్నాథ్ నేతృత్వంలో ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమానికి పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం గొన్నవానిపాలెం నుండి గొన్న హేమచంద్ నాయుడు ఆధ్వర్యంలో సుమారు 100 బైకులతో యువకులు లంకెలపాలెం జంక్షన్ మీదుగా వెళ్లారు. లంకెలపాలెం వద్ద స్థానిక ఎమ్మెల్యే అదీప్ రాజ్ హేమ్ చంద్ నాయుడు బండి వెనక కూర్చుని కొంత దూరం ఈ బైక్ ర్యాలీ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదీప్ రాజు మాట్లాడుతూ ఇది బస్సుయాత్రగా మొదలై 2024 ఎన్నికల్లో విజయ యాత్రతో ముగుస్తుందని అన్నారు. ఈ రాష్ట్రంలో యువత వైఎస్ఆర్సిపి వెంటే ఉన్నారు అనడానికి హేమ్ చంద్ నాయుడు వెనుక ఇంత మంది యువకులు రావడమే నిదర్శనం అని అన్నారు. అనంతరం ఈ ర్యాలీ అనకాపల్లి వరకు సాగింది.

## భీమిలి లో ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి



భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): భీమిలి మండలం అమనాం గ్రామ సచివాలయం (10390236) ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం రెండో రోజు ఇంటింటా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న భీమిలి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దంతులూరి వెంకట శివ సూర్యనారాయణ రాజు (వాసురాజు) భీమిలి మండల పార్టీ అధ్యక్షులు శ్రీ గాడు శ్రీను వైట్ల మరియు పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది.

## ఇక కాలయాపన సాగదు. సమ్మె తప్పదు



అరకులోయ, (విశాఖ సమాచారమ్): ప్రతిసారి తమను మోసగిస్తున్న టూరిజం శాఖకు ఈసారి బుద్ధి చెప్పేందుకు , 11 నుండి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు టూరిజం కార్మికులు హెచ్చరించారు ఏది ఏమైనా సమస్యల పూర్తి పరిష్కారం వరకు విరమించేది లేదనీ కార్మికులు అంటున్నారు ఉమ్మడి విశాఖ మన్యంలోని ఐదు టూరిజం క్షేత్రాలలో రాష్ట్ర టూరిజం లో అత్యధికంగా ఆదాయం వస్తుంది. అనంతగిరి మండలంలోని తైడా, బొర్రా, హరిత రిస్సార్ట్స్, అరకులోయలోని మయూరి, పున్నమి, ట్రైబల్ మ్యూజియం, కొల్లాపూట్, చింతపల్లి సమీపంలోని లంబసింగి పర్యాటక క్షేత్రాలలోనూ టూరిజం రిసార్ట్స్ ఉన్నాయి.ఈ యూనిట్ లలో సుమారు 250 మందికి పైగా గిరిజన కార్మికులు పనిచేస్తున్నారు వీరిలో అనేకమంది 20 - 30 సంవత్సరాల నుండి పనిచేస్తున్న వారు ఉన్నారు. కొందరు రిటైర్ అయిపోయారు.వీరికి పదోన్నతి గానీ ,జీతం పెంపుగానీ ఇప్పటివరకు లేవు అత్యధికంగా 15,000 మాత్రమే వీరి జీతం అంతేకాక కాంటాక్ట్ వర్కర్లు గా ఉన్న వీరిని డైలీ డ్యూటీ వర్కర్లు గా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.అంతేకాక ఆయా పంచాయితీ కట్టవలసిన 20 శాతం పన్నులు కూడా ఈ టూరిజం శాఖ వారికి కట్టటం లేదు. ఇలా బొర్రా పంచాయతీ కి ఏడు కోట్లు, పెదలబుడు పంచాయతీలకు తొమ్మిది కోట్లు బకాయి పడింది.వచ్చే ఆదాయం గణనీయంగా ఉన్నప్పటికీ ఇలా జీతాలు పెంచక పోవడం ,ప్రమోషన్ లు ఇవ్వకపోవడం పంచాయతీ కట్టవలసిన పన్నులు కట్టక పోవడం, కార్మికులకు రాసి ఇచ్చిన హామీల సైతం తుంగలో తొక్కడం ఇప్పటికీ 13 సార్లు జరిగింది.ప్రతి ఏడాది సమ్మె ప్రారంభించగానే అధికారులు వచ్చి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు కూడా నిర్లక్ష్యం చేయటం కార్మిక నాయకులను విజయవాడ పిలిచి అవన్నీ "తూచ్" అని చెప్పటం, దీనితో కథ మొదటికి రావడం జరుగుతూ వస్తూంది.ఈ నేపథ్యంలో అక్టోబర్ 22 నుండి నుండి సమ్మెకు దిగుతామని కార్మిక సంఘాల యాజమాన్యానికి నోటీసులు ఇచ్చాయి. దీన్తో ఎమ్మెల్సీ రవిబాబు నేతృత్వంలో మధ్యవర్తిత్వం వహించి పది రోజులు సమయం కావాలని అడిగిన ప్రభుత్వం నుండి కార్మిక సంఘాలకు నవంబర్ 7 వరకు ఎలాంటి సమాధానం రాకపోవడంతో చివరిగా 8 న బుధ వారం బొర్రా లో జరిగిన అఖిల పక్షం సమావేశం లో 11 నుండి తప్పనిసరిగా నిరవధిక సమ్మెలో పాల్గొనేందుకు ఆమోదం కార్మిక సంఘాలు తెలియ జేశాయి.అయితే దీనికి సంబంధించి స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ వివరణ వేరేలా ఉంది.

కార్మిక సంఘాల తమను కలిశాయనీ, తాము అల్లూరి జిల్లా కలెక్టర్ తోను, టూరిజం ఏం డీ తోను, టూరిజం శాఖ సెక్రెటరీ తోనూ మాట్లాడటం జరిగిందని, దీనిపై అత్యవసర సమస్యలు వెంటనే పరిష్కరించడానికి వీలుగా ఫైల్ తయారుచేసి మంత్రి గారి వద్ద ఉంచడం జరిగిందని, అయితే ప్రస్తుతం కమిషనర్ మహారాష్ట్ర ఎన్నికల బాధ్యతలలో ఉండటం వలన 17 తర్వాత ఈ సమస్య ను పరిష్కారం చేస్తామని కమిషనర్ తమకు తెలియజేసినట్లు అరకు ఎమ్మెల్యే తెలిపారు.కార్మిక సంఘాలు అప్పటివరకు సహనం పాటించాలని కోరినట్లు, ఎమ్మెల్యే అంటున్నారు.

## కరువుపై టిడిపి పోరుబాట

యస్.రాయవరం, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో వర్షా బావ పరిస్థితితో ఏర్పడిన కరువుపై టిడిపి పోరుబాట చేపట్టింది. శుక్రవారం ఎస్ రాయవరం మండలంలో పేట సూది పురం సైతార్ పేట, సర్వశుద్ధి, ఎస్. రాయవరం గ్రామాల మీదగా టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేపడుతూ కరువు ఏర్పడిన ఈ ప్రభుత్వము కనీసం రైతులపై సానుభూతి లేకపోవడం దారుణమని విమర్శించారు. వేసిన వరినారులు ఎండిపోవడం వల్ల రైతులు ఆందోళన వ్యక్తం చేసిన కనీస సాగునీరు సరఫరా చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనం విమర్శించారు ఎస్. రాయవరం తహసిల్దార్ కార్యాలయం వద్ద వరకు పాదయాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మాజీ ఎంపీపీ ఏజర్ల వినోదరాజు, మండల పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, కొప్పిశెట్టి వెంకటేష్, పెద్దిరెడ్డి చిట్టిబాబు, జానకి శ్రీను, టిడిపి సీనియర్ నాయకులు రావి రమణబాబు, కందుల వెంకటేశ్వరరావు, తుమ్మపాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో బయలుదేరిన ఎం విఆర్ ఉచిత తీర్థయాత్ర వాహనాలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ప్రముఖ వాణిజ్య వేత్త, సామాజికవేత్త ఆధ్యాత్మిక చింతనతో భగవంతుని పట్ల అపారమైన భక్తి భావం కలిగిన ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) ఆధ్వర్యంలో ఉచిత నిత్య తీర్థ యాత్రలు యధా విధిగా జోరుగా కొనసాగుతున్నాయి.ఈ మేరకు ఎలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం లోని మూల పేట పంచాయితీ పరిధికి చెందిన గంగదేవి పేట గ్రామానికి చెందిన భక్తులతో ట్రస్ట్ బస్సు బయలుదేరింది.గ్రామ సర్పంచ్ మొల్లేటి చంద్ర రావు సమక్షంలో గ్రామ మహిళలు ఈ యాత్రకు బయలు దేరారు.ఈ సందర్భంగా ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం వి ఆర్) కు శాలువా కప్పి సర్పంచ్ ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలోని ప్రముఖ పుణ్య క్షేత్రాలైన సింహాచలం, అన్నవరం, కనకమహాలక్ష్మి తదితర ఆలయాల దర్శనములకు భక్తులను సకల సౌకర్యాలతో ఉచితంగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసారు.దీనిలో భాగంగా భక్తులకు ఉదయం అల్పా హారం, మధ్యాహ్నం భోజనం సదుపాయం,అదేవిధంగా రాత్రికి అల్పారం తో పాటు త్రాగునీరు ను అందిస్తున్నారు. అలాగే,ఎక్కడికక్కడ తాగు నీటి సదుపాయాలను కూడా ట్రస్ట్ సభ్యులు కల్పిస్తూ భక్తులను దైవ దర్శనానికి తీసుకు వెళ్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మీ ఆశీస్సులు ఉంటే మరల జగనే సీఎం... ఎమ్మెల్యే అదిప్



పరవాడ, (విశాఖ సమాచారమ్): గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పరవాడ పురవీధుల్లో ప్రతి గడపలో ప్రజలని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రతి ఒక్క సమస్యలు అడిగి తెలుసు కుంటున్న పెందుర్తి శాసనసభ్యులు .అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం వచ్చాక పేద ప్రజలకు, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పార్టీలకు అతీతంగా అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మీ ఆశీస్సులు ఉంటే మరల వైయస్ జగన్మోహన్ రెడ్డి సీఎం అవ్వటం ఖాయమని అన్నారు. ప్రజలు ఎమ్మెల్యేకు నీరాజనం పడుతూ పూలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాస్, జడ్పిటిసి సభ్యులు పి ఎస్ రాజు, సర్పంచ్ సరిపరపు అప్పల నాయుడు,జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామనాయుడు , ఉప సర్పంచ్ బండారు రామారావు , పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు , స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మరియు సచివాలయ సిబ్బంది మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## డస్ట్ అలవెన్స్ అగ్రిమెంట్ తక్షణమే వర్తింప చేయాలి!



పరవాడ, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా పరవాడ మండలం సింహాద్రి ఎన్టీపీసీలో డస్ట్ అలవాన్స్ అగ్రిమెంట్ చేసి మూడు నెలలు కావస్తున్న నేటికీ అమలు చేయకపోవడం దుర్మార్గమని టిఎన్టియుసి, బి ఎం ఎస్, సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ఎన్టిపిసి మెయిన్ గేట్ వద్ద శుక్రవారంనిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మానవరపు అప్పలనాయుడు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులుగనిశెట్టి సత్యనారాయణ , బి ఎం ఎస్ లీడర్ బొట్ట రమణ , టిఎన్టియుసి లీడర్ పైలా సన్యాసినాయుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్ఆర్ నాయుడు మాట్లాడుతూ ఎన్టిపిసి యాజమాన్యం కార్మిక చట్టాలను కార్మిక హక్కులను అరిస్తుందని అన్నారు. చేసిన అగ్రిమెంట్ అమలు చేయకపోవడం దుర్మార్గం అన్నారు. ఎన్టిపిసి లోగో కూడిన ఐడి కార్డులు కార్మికులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు యాజమాన్యం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు లేబర్ అధికారులు ప్రభుత్వం ఎన్టిపిసి యాజమాన్యం ఉండి చేసిన అగ్రిమెంట్ కి అతి గతి లేకపోతే ఎవరి దేనికి బాధ్యత వహిస్తారు అని ప్రశ్నించారు ఈ కార్యక్రమంలోటిఎన్టియుసి లీడర్స్ బంగారు బాబు, అలీ, నంబారు రమణ, ఎస్ దేముడు ,ఎం శ్రీను (తాడి) సిఐటియు ఎన్టిపిసి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి గోవిందరాజుఎన్ టి పి సి కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## డిసిఎంఎస్ ద్వారా బ్రాండెడ్ దీపావళి సామాన్లు అమ్మకాలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): పట్టణములో డీసీఎంఎస్ ఆవరణలో బాణాసంచా షాపులు సంస్థ చైర్మన్ పల్లా నర్సింగ రావు పూజ చేసి శుక్రవారం అమ్మకాలను ప్రారంభించారు. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా బ్రాండెడ్ దీపావళి సామాన్లు మా సంస్థ ద్వారా అమ్మకాలు ప్రారంభించామని, పట్టణ గ్రామీణ ప్రాంతాల ప్రజలు సహాయ సహకారాలు అందించాలని చైర్మన్ పల్లా కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఐ వి రమణ మూర్తి, డైరెక్టర్లు పిడి గాంధీ, బొడ్డు గణపతి తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో కమల వికాసం ఎప్పుడో ........!? అవసరం
### (రాజకీయ పార్టీల చరిత్ర)
సెల్ : 8522825622 మూకల సూర్యప్రకాష్

(నిన్నటి తరువాయి)

అలాగే కమ్యూనిస్టులకు ఏ విధమైన జాతీయ భావాలు లేకపోవడం మన జాతి పట్ల, మన ధర్మం పట్ల, మన ఆచార వ్యవహారాల పట్ల, మన నమ్మకాల పట్ల చిన్న చూపు కలిగి వుండటం, మెజార్టీలను విమర్శిస్తూ, వారి చరిత్రను అవహేళన చేయడం మొదలైన చర్యలు కూడా ఒక కారణమే.

కమ్యూనిస్టు పార్టీలు వాటి అనుబంధ సంఘాల సభ్యులు, కార్యకర్తలు, నాయకులు ఎంతసేపూ లెనిన్, స్టాలిన్, మావో, కారల్ మార్క్స్ మొదలైనవారినే ఆరాధ్యులుగా ఆరాధిస్తారు తప్పిస్తే, మన దేశ స్వాతంత్ర్య సమరయోధులనుకాని, మన పూర్వీకులను కాని అసలు పట్టించుకోరు, గుర్తించరు. ఈ విధంగా కమ్యూనిస్టులలో ఉన్న ఈ భావదారిద్ర్యం కారణంగానే భారతీయులను ఒక జాతిగా గుర్తించకుండా జాతీయ వాదాన్ని అపహాస్యం చేస్తున్నారు.

విశ్వ మానవతావాదం గొప్పదే. అంతమాత్రం చేత మనల్ని మనం తక్కువ చేసుకోనక్కరలేదు. అదే విధంగా దేశ ప్రయోజనాలను కూడా ఫణంగా పెట్టి, విదేశాలలోని కమ్యూనిస్టులను సమర్ధించడం ఎంతవరకు సమంజసమో ప్రతీ భారతీయ కమ్యూనిస్టు ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

అదేవిధంగా 'జాతీయవాద కమ్యూనిజాన్ని' రూపొందించుకొని, జాతీయతకు, దేశీయ విలువలకు, మన ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలకు పెద్ద పీట వేసినప్పుడు మాత్రమే కమ్యూనిస్టు పార్టీలు తిరిగి ప్రాముఖ్యతను సంతరించుకుంటాయి. లేదంటే దేశంలో కమ్యూనిస్టు పార్టీలు కనుమరుగౌతాయి. ఇంకా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వాటికి స్థానమే వుండదు.

ఎందుకు సినీతారలు రాజకీయాలలో మెరుస్తున్నారు?

అలాగే! అంతలోనే కనుమరుగవుతున్నారు?

సాంకేతిక విప్లవంతో నాటకాల స్థానంలో సినీరంగం అభివృద్ధి చెందటంతో అందులోని సానుకూలతల దృష్ట్యా ఒక్కసారి తీసిన సినిమా ఎన్నిసార్లు అయినా ఎన్ని చోట్లయినా ప్రదర్శించే సౌలభ్యం కారణంగా అందులోని నటీనటులకు విశేష ఆదాయం, విశేష ప్రజాదరణ చేకూరాయి.

దీనితో సినిమా హీరోలకు విశేష కీర్తిప్రతిష్టలు రావటమే కాకుండా అభిమానులు ఊరూరా ఏర్పడ్డారు. అంతేకాక ఆ సినీ తారలను చూడటానికి జనాలు ఎగబడటంతో ఆ సినీ గ్లామర్‌ని పెట్టుబడిగా పెట్టి ప్రపంచవ్యాప్తంగా సినీ తారలు రాజకీయరంగంలో ప్రవేశించారు.

ఏ స్థాయిలోనైనా అధికారమే అల్టిమేట్. ఒక స్థాయి వరకు డబ్బు పవర్‌ఫుల్‌గా ఉన్నాకూడా, ఒకస్థాయి దాటిన తరువాత అధికారానిదే పైచేయి. అందుకే యుద్ధాలేమిటి! రక్తపాతాలేమిటి! అన్నీ అధికారం కోసమే జరిగాయి, జరుగుతున్నాయి.

కానీ! ప్రజాస్వామ్య దేశంలో జనబలం ఉన్నవాడు సుప్రీమ్ పవర్. అందుకే జనాకర్షణ వున్నవారు అధికారంకోసం రాజకీయ రంగ ప్రవేశం చేస్తున్నారు.

అందులో ప్రముఖంగా సినిమా హీరోలు అనేకమంది రాజకీయాలలో ప్రవేశించడమే కాదు, స్వంతంగా పార్టీలనే స్థాపించి కొందరు సక్సస్ అయితే, మరి కొందరు ఫ్లాప్ అవుతున్నారు. అందుకు అనేక కారణాలు. రెండింటికీ కూడా ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రం వేదికగా నిలచింది.

మొదటిగా సినీ రంగం నుండి వచ్చి తెలుగు దేశం పార్టీని పెట్టిన నటరత్న ఎన్.టి.రామారావు సక్సెస్ అయితే, మెగాస్టార్ చిరంజీవి ఫ్లాప్ అయ్యారు. ఇప్పుడు రంగంలో ఉన్న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఎటూ తేలక ఊగిసలాడుతున్నారు.

**తెలుగుదేశం** : ఉమ్మడి అంధ్రప్రదేశ్ రాజకీయాలలో ప్రాంతీయ పార్టీల శకం 1982వ సం.లో తెలుగుదేశం ఆవిర్భావంతోనే ప్రారంభమైంది.

అప్పటివరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంలేని కారణంగా ఏకఛత్రాదిపత్యంగా రాష్ట్రాన్ని ఇష్టం వచ్చినట్లు పాలించింది. విధేయత, భజన చేయడమే అర్హతగా, చెప్పుచేతల్లో ఉండే వారినే ముఖ్యమంత్రులుగా నియమిస్తూ ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ తెచ్చే విధంగా గాంధీ, నెహ్రూల వారసుల నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ వ్యవహరించింది.

ఇటువంటి పరిస్థితుల్లో తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో, అప్పటికి వెండి తెరపై ఓ వెలుగు వెలుగుతున్న సినీనటుడు నటసార్వభౌమ నందమూరి తారక రామారావు "తెలుగు దేశం" పార్టీని స్థాపించి రాజకీయ రంగ ప్రవేశం చేశారు.

దేశంలో తెలుగు వారికి గుర్తింపు కోసం మరియు అప్పటి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులకు, తెలుగువారికి సరైన గౌరవం ఇవ్వడం లేదనే అవేదనతో ఎన్.టి.రామారావుగారు రాజకీయాలలోకి వచ్చానని ప్రకటించారు.

కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా తెలుగువారికి విలువలేకపోతే సరిచేయడానికి ఆ పార్టీలో చేరి ఎదిరించాలి కానీ! క్రొత్త పార్టీతో కాంగ్రెస్ పార్టీలో మార్పులు ఏమి వస్తాయనే విమర్శలు కూడా వచ్చాయి.

అలాగే ఎన్.టి.రామారావుకు విశేష ప్రజాకర్షణ ఉన్నా! ధనబలం ఉన్నా! రాజ్యాధికారం సాధించడానికే రాజకీయరంగ ప్రవేశం చేశారన్నది నిర్వివాదాంశం అని విశ్లేషకుల అభిప్రాయం.

**ఆవిర్భావం** :- 1982, మార్చి 29వ తేదీన 'తెలుగుదేశం' పార్టీ హైదరాబాద్‌లో ప్రారంభించబడింది. తన "చైతన్యరథం"లో 'తెలుగుదేశం పిలుస్తోంది, రా! కదలిరా!!' అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి పర్యటన చేసి, 1983 జనవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి రాష్ట్రంలో మొదటి కాంగ్రేసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన ఎన్.టి.రామారావు గారు పార్టీని ప్రారంభించిన 9 నెలల్లో ముఖ్యమంత్రి అయ్యి చరిత్ర సృష్టించారు.

నటన వేరు, పరిపాలన వేరు. సినిమా అన్నది ఒక ఊహ, ఓ కల్పిత కథ. ఏ అద్భుతాలనైనా ఆవిష్కరించవచ్చు, దేనినైనా చూపించవచ్చు, నిజమని నమ్మించవచ్చు. ఏదైనా తప్పు జరిగితే, ఆ సినిమాకే పరిమితం. ఫ్లాప్ అయితే ఆర్థికంగానే నష్టంవస్తుంది.

(మిగతా రేపటి సంచికలో)

# విజయవాడ సభను జయప్రదం చేయండి



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం లో 15 న సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో విజయవాడ లో జరుగుతున్న బహిరంగ సభ ను జయప్రదం చేయాలని కోరుతూ ఈరోజు నక్కపల్లి లో సిపిఎం నాయకులు గోడపత్రికను అవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయాలు సమస్యలు పరిష్కారం, అభివృద్ధి గురించి కాకుండా వ్యక్తులు చుట్టూ తిరుగుతున్నాయని ఇది రాష్ట్ర అభివృద్ధికి చాలా నష్టదాయకమన్నారు. రాష్ట్రంలోను, అనకాపల్లి జిల్లాలో కరువు విలయ తాండవం చేస్తుంటే,ఈ కరువు బారినుండి రైతులను, కూలీలను ఆదుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం తప్పించుకుంటుందని అనకాపల్లి జిల్లా లో గల 24 మండలాల్లోకి 18 మండలాల్లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు నెలకొని వేసిన వరి ఇతర పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు అయినా జిల్లా లో ఒక మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించకుండా జిల్లా రైతాంగానికి తీవ్రంగా ద్రోహం చేశారని తెలిపారు, రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే అనకాపల్లి జిల్లా ను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను, కూలీలను ఆదుకోవాలని కోరారు. 15 న విజయవాడ లో జరిగే బహిరంగ సభలో ఈ సమస్యపై మాట్లాడటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం. సత్యనారాయణ, ఎం.రాజేష్, ఎం. శివాజీ, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# 'స్వచ్ఛ్ దీపావళి - శుభ దీపావళి' జరుపుకుందాం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్వచ్ఛ్ భారత్ మిషన్ 2.0 మార్గదర్శ కాలలలో భాగంగా కేంద్ర గృహ నిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సూచనలకు అనుగుణంగా ప్రజలందరూ రానున్న దీపావళి పండుగను 'స్వచ్ఛ దీపావళి - శుభ్ దీపావళి' గా జరుపుకోవాలని పిలుపు నిస్తూ ప్రచారాన్ని ప్రోత్సహిస్తుందని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ విషయమై విశాఖ నగరంలో ప్రజల అవగాహన కొరకు కేంద్ర గృహ నిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సూచించిన 'స్వచ్ఛ దీపావళి - శుభ్ దీపావళి' ప్రతిజ్ఞ (URL లింక్ ప్రతిజ్ఞ తీసుకోవడానికి - https://pledge.mygov.in/swachh-diwali-shubh-diwali) ను జివి ఎంసి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తుంది.

విశాఖ నగరంలో దీపావళి వేడుకల సందర్భంగా కాలుష్యాన్ని అరికట్టేందుకు జివిఎంసి అన్ని చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా దీపావళి పండుగ వాతావరణంలోని గాలి, శబ్దం, ఘన మరియు నీరు వంటి అన్ని భాగాలతో అనుబంధించబడినందున, ప్రతి కాలుష్యాన్ని విడివిడిగా పరిష్కరించడానికి ఒక ప్రత్యేక బృందంతో జీవీఎంసీ సమగ్ర పద్ధతిలో పనిచేస్తోంది.

పారిశుద్ధ్యానికి సంబంధించి, స్వచ్ఛ దీపావళిపై పౌరులకు అవగాహన కల్పించేందుకు జీవీఎంసీ 08.11.2023న ఆర్.కె. బీచ్‌లో 'స్వచ్ఛ దీపావళి - శుభ దీపావళి' ప్రచారాన్ని ప్రారంభించింది. మునిసిపల్ కార్మికులను పని సమయంలో సురక్షితంగా ఉంచడానికి మాస్కులు, గ్లోవ్స్, షూలతో కూడిన పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్ (పీపీఈ) కిట్‌లు పంపిణీ చేయబడ్డాయి. కార్మికులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. పగటిపూట 5607 మంది మున్సిపల్ కార్మికులు మరియు రాత్రి సమయంలో 380 మంది కార్మికులు నగరమంతా పరిశుభ్రత కోసం పని చేస్తున్నారు మరియు దీపావళి తర్వాత మరింత ప్రభావవంతంగా పని చేయా లని కోరారు.

వ్యర్థ పదార్థాల పునర్వినియోగం మరియు రీసైకిల్ కోసం ఏర్పాటు చేయబడిన సమీపంలోని ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలలో అన్ని రకాల పునర్వినియోగ వ్యర్థాలను డిపాజిట్ చేయమని పౌరులందరికీ తెలియ జేసి ప్రోత్సహించ బడుతుందన్నారు. అందులో ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలు మరియు వాటి థీమ్‌లు :

పాత పుస్తకాలు తిరిగి ఉపయోగించుకునేలా తగరపువలస ప్రాంతంలో "బుక్ కేఫ్" ను, పాత బొమ్మలను తిరిగి ఉపయోగించేలా యెండాడ ప్రాంతంలో థీమ్ "చిల్డ్రన్ ప్లే ఏరియా" ను, గార్డెనింగ్ మరియు ఇంటి కంపోస్టింగ్ గురించి అవగాహనను ప్రోత్సహిస్తూ కె.ఆర్.ఎంలో కాలనీ ప్రాంతంలో "మీ ఇంటి తోట" థీమ్ ను, అప్‌సైకిలింగ్ వస్తువులతో క్రాఫ్ట్ మేకింగ్‌ను, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తూ జగదాంబ ప్రాంతంలో "ఉమెన్స్ రెస్టో కేఫ్" థీమ్ ను, వ్యర్థ పదార్థాలతో కొత్త ఉత్పత్తులను, కళాఖండాలను తయారు చేయడంపై శిక్షణ ఇచ్చుటకు జ్యోతినగర్ ప్రాంతంలో "వేస్ట్ అప్‌సైక్లింగ్‌ను పునరాలోచించండి" అనే థీమ్ ను, పాత బట్టలను ఉపయోగించి గుడ్డ సంచులను రూపొందించడానికి గాజువాక ప్రాంతంలో "బట్టల వ్యర్థాలను అప్‌సైక్లింగ్ చేయడం" థీమ్ ను ప్రజల కోసం అందుబాటులో ఉంచడమైనదన్నారు.

ఈ ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలు వ్యర్థ పదార్థాలను ఉపయోగకరమైన ఉత్పత్తులుగా మార్చడంలో ప్రజలను చురుకుగా నిమగ్నం చేస్తాయన్నారు. అదే సమయంలో వ్యర్థాలను తగ్గించడానికి జీవనశైలి మార్పులు మరియు రోజువారీ పద్ధతులపై విద్యాపరమైన అంతర్దృష్టులను అందిస్తాయన్నారు. ఈ పద్ధతులను చేర్చడం ద్వారా, పర్యావరణాన్ని పరిరక్షించడమే కాకుండా ఆర్థిక స్థిరత్వాన్ని కూడా సాధించగలమన్నారు. ఒక వైపు రోజువారీ జీవితంలో పర్యావరణ అనుకూల ఉత్పత్తులను ఉపయోగించమని జివిఎంసి ప్రజలను ప్రోత్సహిస్తూ, మరొక వైపు తన అంకితమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ద్వారా వాణిజ్య సంస్థలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (ఎస్‌యుపి) వాడకంపై అవగాహన పరమైన చర్యలు తీసుకుంటుందన్నారు.

అన్ని సాంప్రదాయ పండుగలను పర్యావరణ హిత పండుగలుగా జరుపుకోవాలని అవగాహన కల్పిస్తూ దీపావళిని "స్వచ్ఛ దీపావళి"గా జరుపుకోవాలని కమీషనర్ పేర్కొన్నారు. ఈ విషయమై నగరం లో జీరో-వేస్ట్ ఫెస్టివల్స్, ఈవెంట్‌లను పర్యావరణ హితముగా జరుపుకోవడానికి ఎన్‌జిఓలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియే షన్‌లు (ఆర్‌డబ్ల్యూఎ), శానిటేషన్ సెక్రటరీలు, సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు మరియు వాలంటీర్లతో సమావేశాలు నిర్వహించడమైనదని కమీషనర్ తెలిపారు.

# బెయిల్ పై వచ్చి చనిపోయారని నాటకం



అతడు హత్య కేసులో నిందితుడు. బెయిల్‌పై విడుదలయ్యాడు. ఆ తరువాత అకస్మాత్తుగా మాయమయ్యాడు. ఆ తరువాత ఎనిమిదేళ్ల పాటు అతడి జాడ కనిపించకపోవడంతో అతడు మృతి చెందాడని బంధువులు స్నేహితులు అనుకున్నారు. పోలీసులూ అదే భావించారు. కానీ, ఓ పెళ్లికార్డుపై జరిగిన పొరపాటుతో బండారం మొత్తం బయటపడిపోయింది. తమిళనాడులో వెలుగు చూసిన ఈ ఘటన పూర్తి వివరాల్లోకి వెళితే..

కడలూర్ జిల్లాకు చెందిన కె.గణేశ్ 2015లో ఓ హత్య కేసులో జైలు పాలయ్యాడు. ఆ తరువాత అతడికి బెయిల్ మంజూరయ్యింది. కానీ, బెయిల్‌పై విడుదలైన కొద్ది రోజులకే అతడు కనిపించకుండాపోయాడు. పోలీసులు ఆ తరువాత చాలా కాలం పాటు అతడి కోసం వెతికినా జాడ కనిపించలేదు. బంధువులు, స్నేహితులకు కూడా అతడి గురించి ఏ సమాచారం అందలేదు. అలా అన్ని జాగ్రత్తలు తీసుకుని తప్పించున్నాడు గణేశ్. దీంతో, అతడి మరణించాడని పోలీసులూ భావించారు. మరోవైపు, గణేశ్ ఏపీలోని నగరికి చేరుకుని మరో మహిళను వివాహం చేసుకున్నాడు. అతడికి పిల్లలు కూడా కలిగారు. పరిస్థితి ఇలాగే ఉంటే అతడు ఎప్పటికీ దొరికేవాడు కాదేమో గానీ, గణేశ్ బంధువుల ఇంట్లో జరిగిన ఓ పెళ్లి అతడి పుట్టిముంచింది.

ఈ వేడుకకు సంబంధించిన పెళ్లికార్డులో గణేశ్ పేరు ముద్రించారు. కానీ దాని పక్కన లేట్ అని రాయలేదు. దీంతో, పెళ్లికార్డు చూసిన గణేశ్ బంధువులు అందరూ ఆశ్చర్యపోయారు. గణేశ్ చనిపోయినా అతడి పేరు పక్కన 'లేట్' అనే పదం ఎందుకు చేర్చలేదో ఎవరికీ అర్థంకాలేదు. అయితే, ఈ ఉదంతం జిల్లా పోలీసుల దృష్టికి వెళ్లింది. దీంతో, వారు మరో ఆలోచన చేయకుండా గణేశ్ బంధువుల ఫోన్లపై నిఘా పెట్టడంతో గణేశ్ ఆడిన నాటకం మొత్తం బయటపడింది. అతడు ఏపీలోని నగరిలో ఉన్నాడని గుర్తించిన కడలూర్ పోలీసులు అక్కడికి వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో న్యాయమూర్తి పోలీసులను అభినందించారు.

# గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



**చోడవరం, (విశాఖ సమాచారమ్):** బుచ్చయ్యపేట శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20 వరకు జరిగే 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతం చేయాలని స్థానిక గ్రంథ పాలకులు ఆర్. కృష్ణారావు కోరారు. శుక్రవారం ఆయన దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయలకు వారోత్సవాల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు కె. సత్యారావు చేతులు మీదుగా కరపత్రాలు ఆవిష్కరించారు. గ్రంథాలయాలను సందర్శించి విజ్ఞానాన్ని పెంచుకోవాలని పేర్కొన్నారు.

# ఏటీఎం పద్ధతిలో కూరగాయలు పెంపకం



**చోడవరం, (విశాఖ సమాచారమ్):** ప్రకృతి వ్యవసాయంలో ఏటీఎం పద్ధతిలో కూరగాయలు వేయడం వలన నిరంతరం ఆదాయము పొందవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ పరిపాలన నిపుణులు ఆర్ వి స్వామి నాయుడు చెప్పారు. గురువారం చోడవరం మండలం ఖండేపల్లి గ్రామంలో క్యాడర్ ఫీల్డ్ లో ఏటీఎం మోడల్ నిర్వహించారు. 20 సెంట్లు విస్తీర్ణంలో సుమారు 23 రకాలు కూరగాయలు, ఆకుకూరలు, దుంప జాతి, తీగజాతి , కూరగాయలు వేసుకోవడం ద్వారా వేసిన 25-30 రోజుల నుండి ఆకుకూరలు ద్వారా అధికాదాయం పొందవచ్చన్నారు.

# అగ్రహారం పాఠశాలలో చెకు ముఖి పోటీలు



**చోడవరం, (విశాఖ సమాచారమ్):** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యం లో శుక్రవారం మాడుగుల మండలం జి అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పాఠశాల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ పరిక్షలో 9 మంది బాలురు, 16 మంది బాలికలు మొత్తం 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో జన విజ్ఞాన వేదిక తరపున వి. ఎన్. బి. దేవ వర్మ మాస్టారు పరిశీలకులు గా వ్యవహరించారు. ఉపాధ్యాయులు ఏ. ప్రసాదరావు, గాసన్న, అనిల్ కుమార్, తదితర ఉపాద్యాయులు పాల్గొన్నారు.

# మునిరత్నం నాయుడుపై వైసీపీ దాడిని ఖండిస్తున్నాం

### చెవిరెడ్డి తన చెంచాలను అదుపులో పెట్టుకోవాలి
### కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి, (విశాఖ సమాచారమ్):** చంద్రగిరి మండలం, భీమవరం గ్రామ టీడీపీ అధ్యక్షుడు మునిరత్నం నాయుడుపై వైసీపీ గూండాల దాడిని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. మద్యం, గంజాయి మత్తులో చెవిరెడ్డి అనుచరులు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, నవీన్ రెడ్డి తన అనుచరులతో ఇష్టానుసారంగా దాడికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహిత్ రెడ్డి తన చెంచాలను అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఓటమి అంచున వైసీపీ వేలాడుతున్నందునే దాడులకు పాల్పడుతోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి గాల్లో తిరుగుతూ...శాంతిభద్రతలు గాలికొదిలేశారని, ఎన్ని దాడులు, బెదిరింపులకు దిగినా టీడీపీ వెనకడుగు వేయదన్న విషయాన్ని వైసీపీ గూండాలు గుర్తుంచుకోవాలన్నారు. పవిత్రమైన తిరుపతి పరిసర ప్రాంతాల్లో అలజడి సృష్టిస్తున్నారని, మునిరత్నం నాయుడుపై దాడి చేసి నగదు, బంగారం కూడా లాక్కెళ్లి బందిపోటు ముఠాను తలపించారని దుయ్యబట్టారు. దాడి చేసిన వైసీపీ నేతలపై ఎస్పీ పరమేశ్వరరెడ్డి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ దాడిలో మునిరత్నం తీవ్రంగా గాయపడ్డారని, మునిరత్నం కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.

# ఈ నెల 12న తిరుమలలో బ్రేక్ దర్శనాల రద్దు



తిరుమలలో దీపావళి సందర్భంగా ఈ నెల 12న బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు. ఆ రోజున శ్రీవారి సన్నిధిలో దీపావళి ఆస్థానం నిర్వహించనున్నట్టు టీటీడీ వెల్లడించింది. కేవలం ప్రోటోకాల్ దర్శనాలను మాత్రమే అనుమతించనున్నట్టు తెలిపింది. నవంబరు 11న ఎలాంటి సిఫారసు లేఖలు స్వీకరించబోమని టీటీడీ స్పష్టం చేసింది. దీపావళి సందర్భంగా ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు శ్రీవారి ఆలయంలోని ఘంటా మండపంలో దీపావళి ఆస్థానం నిర్వహించనున్నారు. ఆస్థాన స్వామికి ప్రత్యేక పూజ, హారతి, ప్రసాద సమర్పణతో దీపావళి ఆస్థానం ముగియనుంది.

## సైన్స్ కాంగ్రెస్ లో దిబ్బపాలెం విద్యార్థుల ప్రతిభ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** నియోజకవర్గంలోని కసింకోట జడ్పీ హైస్కూల్ లో నిర్వహించినజిల్లా స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమంలో అనకాపల్లి మండలం దిబ్బపాలెం గ్రామానికి చెందిన జడ్పీ హైస్కూల్ విద్యార్థులు తయారుచేసిన సూర్య మండల పంట రైతుల ఇంట సిరి పంట ప్రాజెక్టు రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్ కు ఎంపికైంది. జిల్లాలోని మండలాల నుండి 75 ప్రాజెక్టులు ఈ కార్యక్రమానికి రాగా అందులో ఏడు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. అందులో దెబ్బపాలెం హై స్కూల్ విద్యార్థులు చేసిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో ప్రాజెక్టు రూపొందించేందుకు గైడెన్స్ ఇచ్చిన సైన్స్ టీచర్ బి వి లక్ష్మి విద్యార్థులను పాఠశాల హెడ్మాస్టర్ జి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ పీలా ఉషా అప్పారావు, ఎంపీటీసీ పెద్దాడ అచ్చియమ్మ అభినందించారు.

## మందుగుండు సామాన్లు అమ్మితే కఠిన చర్యలు



**రావికమతం, (విశాఖ సమాచారమ్):** మండలంలో మేజర్ పంచాయతీ కొత్తకోట గ్రామం లో దీపావళి సామాన్లు క్రయవిక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తకోట సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనుమతులు లేకుండా దీపావళి సామాగ్రి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, సామాన్లు అమ్మాలనుకునే వ్యాపారస్తులు ముందుగా సంబంధిత శాఖలకు సంబంధించిన అధికారుల నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుందని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది అదేవిధంగా రెవెన్యూ డివిజనల్ అధికారి వారి ద్వారా జిల్లా స్థాయిలో అధికారుల నుంచి అనుమతులు పొందాలని సామాగ్రి ఊరికి దూరంగా ఉంచాలని అదేవిధంగా పోలీసులు అగ్నిమాపక సిబ్బంది రెవెన్యూ అధికారులు చెప్పిన ప్రదేశంలో మాత్రమే సామాన్లు విక్రయించాల్సి ఉంటుందని అలా కాకుండా ఇష్టానుసారంగా ఎవరన్నా క్రయ విక్రయాలు చేసిన, లేదా రహస్య ప్రదేశాల్లో సామాన్లు భద్రపరిచినట్లు ఎవరికైనా తెలిసిన తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అటువంటి వ్యాపారస్తులపై శాఖ పరమైనటువంటి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదిలా ఉండగా రాజు వీధిలో కొంత మంది వ్యాపారస్తులు ఇప్పటికే దీపావళి సామాన్లు భద్రపరిచి రహస్యంగా హోల్సేల్ గా చిరు వ్యాపారులకు విక్రయిస్తున్నారని స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. మెడివాడ మేజర్ పంచాయతీ లో కూడా జోరుగా మందుగుండు సామాగ్రి అమ్మకాలు జరుగుతున్నాయి.

## చెత్తకుప్పలో లభ్యమైన ఆ రూ.25 కోట్లు నకిలీవే

బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరు శివారులో చెత్త ఏరుకునే వ్యక్తికి అక్కడి ఓ చెత్తకుప్పలో రూ.25 కోట్ల విలువైన అమెరికన్ డాలర్లు లభ్యమైన విషయం తెలిసిందే. అయితే, వాటిని క్షుణ్ణంగా పరిశీలించగా ఆ నోట్లు నకిలీవిగా తేలాయట. పోలీసులు ఈ విషయాన్ని వెల్లడించారు. వాటిని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు పంపగా.. ఆ నోట్లు ఫొటోకాపీ, లేదా ప్రింట్ తీసినవిగా అధికారులు తెలిపారన్నారు.

సల్మాన్ షేక్ అనే వ్యక్తి ఇటీవల బెంగళూరు శివారులో చెత్త ఏరుకుంటుండగా అమెరికన్ డాలర్ల కట్టలు 23 కనిపించాయి. అతడి యజమాని, అక్కడి నుంచి ఓ సామాజిక కార్యకర్త ద్వారా ఈ వ్యవహారం బెంగళూరు పోలీసుల వద్దకు చేరింది. ఈ మొత్తం విలువ రూ.25 కోట్లు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. ఈ నోట్లపై కొన్ని రకాల రసాయనాలను పూసినట్లు గుర్తించారు. బ్లాక్ డాలర్ స్కామ్‌కు పాల్పడుతున్న ముఠాకి చెందిన వారు ఈ కరెన్సీ నోట్లను అక్కడ వదిలేసి వెళ్లిపోయి ఉంటారని అనుమానించారు.

**చెత్తకుప్పలో రూ.25 కోట్లు..!**

డబ్బుతోపాటు ఐరాస ముద్రతో కూడిన ఓ లేఖ కూడా షేక్‌కు లభించింది. 'దక్షిణ సూడాన్‌లోని ఐరాస శాంతి పరిరక్షక దళాలకు సాయం కోసం ఐరాస భద్రతామండలి ఆమోదంతో ఎకనామిక్, ఫైనాన్సియల్ కమిటీ ప్రకటించిన ప్రత్యేక నిధి' అని రాసి ఉంది. ఈ క్రమంలోనే అవి నిజమైన డాలర్లేనా? నకిలీవా? అని గుర్తించేందుకు వాటిని ఆర్బీఐకు పంపగా.. చివరకు నకిలీవిగా తేలాయి. మరిన్ని వివరాల కోసం వాటిని చెన్నైలోని ఓ ప్రైవేటు బ్యాంకుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## విజయవంతంగా ముగిసిన విమెన్ ఫర్ వాటర్, వాటర్ ఫర్ విమెన్

**విజయవాడ, (పీఐబీ):** జాతీయ పట్టణ జీవనోపాధి కార్యక్రమం, నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్, ఒడిశా అర్బన్ అకాడమీ భాగస్వామ్యంతో గృహనిర్మాణ -పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చేపట్టిన "విమెన్ ఫర్ వాటర్, వాటర్ ఫర్ విమెన్" ప్రచారం మూడవ రోజు 9 నవంబర్, 2023న అద్భుత విజయంతో ముగిసింది. ,.ఈ ప్రతిష్టాత్మక అమలు కార్యక్రమం అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్) కింద ట్రాన్స్ ఫార్మేటివ్ క్యాంపెయిన్, వాటర్ గవర్నెన్స్ కార్యక్రమంలో మహిళలను చేర్చడాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది.

మూడు రోజుల పాటు విస్తరించిన ఈ ప్రచారంలో , దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి (పోల్-బౌండ్ రాష్ట్రాలు మినహా) 14,000 మంది మహిళలు "జల్ దీపావళి"లో చురుకుగా పాల్గొన్నారు. ప్రచారం సందర్భంగా, ఈ సాధికారత పొందిన మహిళలు దేశవ్యాప్తంగా 530కి పైగా నీటి శుద్ధి కర్మాగారాలను సందర్శించారు -ఇంటింటికి పరిశుభ్రమైన -సురక్షితమైన త్రాగునీటిని పంపిణీ చేయడంలో ఉన్న క్లిష్టమైన ప్రక్రియల గురించి అమూల్యమైన ప్రత్యక్ష జ్ఞానాన్ని పొందారు.

రాష్ట్ర అధికారులు స్వయం సహాయక సంఘాల మహిళలకు ఘన స్వాగతం పలికారు, ప్రచారం విజయంలో వారి కీలక పాత్రను నొక్కి చెప్పారు. శిక్షణ మాన్యువల్, వాటర్ బాటిల్స్, సిప్పర్లు, పర్యావరణ అనుకూల బ్యాగులు -బ్యాడ్జ్‌లు వంటి అవసరమైన వస్తువులతో సహా ఫీల్డ్ విజిట్ కిట్‌లు పాల్గొనే వారందరికీ అందించారు.

ప్రచారం అంతటా, మహిళలు నీటి మౌలిక సదుపాయాల రంగాన్ని లోతుగా పరిశోధించారు, నీటి నాణ్యత పరీక్ష అంచెలంచెల విధానంపై నిపుణుల మార్గదర్శకత్వం పొందారు -ఈ పరీక్షలను స్వయంగా వారు నిర్వహించారు. ఈ జ్ఞానం వారి కమ్యూనిటీలకు నీటి స్వచ్ఛత అత్యున్నత ప్రమాణాలను నిర్ధారించడానికి వారిని మరింత శక్తివంతం చేస్తుంది, ఇది నీటి మౌలిక సదుపాయాల పట్ల యాజమాన్యం -బాధ్యత లోతైన భావాన్ని ప్రతిబింబిస్తుంది.

"జల్ దీపావళి"- అమలు ప్రాంతాలలో అమృత్ పథకం కింద నిర్వహించే చర్యల్లో దాని విస్తృత ప్రభావం గురించి మహిళలకు అవగాహన కల్పించడం - నీటి శుద్ధి ప్లాంట్‌ల నిర్వహణ తీరు సమగ్రంగా తెలియజెప్పడం -మహిళా స్వయం-సహాయ బృందాలు రూపొందించిన సావనీర్‌లు -కథనాల ద్వారా సమగ్రతను ప్రోత్సహించడం వంటివి ఉన్నాయి. అదనంగా, పాల్గొనేవారు నీటి వనరులను వివేకంతో సంరక్షించడానికి -ఉపయోగించుకోవడానికి కట్టుబడి ఉన్నారు, ఇది స్థిరమైన నీటి నిర్వహణకు కీలకమైన దశ.

29 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన స్వయం సహాయక సంఘాలు -రాష్ట్ర అధికారుల సమిష్టి ప్రయత్నాలు నీటి మౌలిక సదుపాయాల-క్లిష్టమైన డొమైన్‌లో చేరిక -మహిళా సాధికారత వైపు గణనీయమైన పురోగతిని సాధించాయి.

## జిల్లా ఎస్పీకి ధన్యవాదాలు తెలిపిన ఏపీ ఎక్స్ నేవల్ అసోసియేషన్ సభ్యులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** 52వ బెటాలియన్ జమ్మూ కాశ్మీర్‌లో పనిచేస్తున్న ఆర్మీ జవాన్ సయ్యద్‌పై దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకున్న కారణంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ వైడ్ ఎక్స్ నేవల్ అసోసియేషన్ సభ్యులు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ ను మర్యాదపూర్వకంగా కలిశారు.పరవాడ పోలీస్ స్టేషన్‌కు చెందిన నలుగురు పోలీసులపై సస్పెన్షన్ వేటు వేసినందుకు త్వరితగతిన చర్యలు తీసుకున్నందుకు ఎస్పీకి ధన్యవాదాలు తెలియజేశారు. సమాజంలో పోలీసులంటే గౌరవించేలా ఉండే విధంగా ఈ ఘటనకు పాల్పడిన పోలీసులను శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలని అభ్యర్థించారు. ప్రజలపై నమ్మకం పెరిగే విధంగా ఉండాలంటే అమాయక ప్రజలపై పోలీసుల వైఖరి మారే విధంగా శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ నావికా దళం ప్రెసిడెంట్ రబ్బానీ భాష, కార్యవర్గ సభ్యులు అమరపల్లి కృష్ణ కుమార్, పాపారావు ,మూర్తి,వేణు, మాజీ నేవల్ న్యాయ సలహాదారులు , విడి ప్రసాద్ పాల్గొన్నారు.

## పల్లెపల్లెకు అభివృద్ధి కోసం సిఎంగా జగనే కావాలి



**దేవరాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఏపీకి జగన్ ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని మండల అధ్యక్షులు జేసిఎస్ కన్వీనర్ల వాలంటీర్ల సమక్షంలో వాకపల్లి గ్రామంలో నిర్వహించారు. ముందుగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వైఎస్ఆర్సిపి జెండాను ఆవిష్కరించారు. పలు గృహాలను సందర్శించి మళ్ళీ సీఎం గా జగన్ ఎందుకు కావాలో అర్థవంతంగా వివరించి, కరపత్రాలు రశీదు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, జెడ్పీటీసీ కర్రి సత్యం, మండల అధ్యక్షులు బూరె బాబురావు, కన్వీనర్ కె.వి.రమణ,యువ నాయకులు కర్రి సూరినాయుడు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు,వాలంటీర్లు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల నోట్లో మట్టి కొట్టినందుకా మళ్లీ జగన్ కావాలా?



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఒక్కసారి అవకాశం ఇచ్చినందుకు అన్ని సామాజిక వర్గాలను జగన్ రెడ్డి నమ్మించి నట్టేట ముంచారని యువకుడు తండ్రి రాజశేఖర్ రెడ్డి కి వారసుడుగా ఎన్నో ఆశలు పెట్టుకొని ప్రజలు ఓట్లు వేసినందుకు చుక్కల చూపిస్తున్నాడని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు శుక్రవారం పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వైసిపి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఎందుకు నమ్మాలి జగన్ అని ముఖం మీద చెప్పేస్తున్నారని ఇది గమనించిన వైసిపి ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టడం వల్ల బస్సు యాత్రకు పిలుపిచ్చినా బస్సు యాత్రకు ప్రజాధరణ లేదని సభకి సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని వాలంటీర్లు బెదిరించి తీసుకువచ్చిన కనీసం అరగంట కూడా నిలువ లేక వచ్చినవారు వచ్చినట్టే తిరిగి వెళ్లిపోవడంతో ఖాళీ కుర్చీలు ప్రత్యక్షం అవుతున్నాయని నాగ జగదీశ్ ఎద్దేవా చేశారు. ప్రతి సంవత్సరం జనవరిలో అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పిన జగన్ రెడ్డి వారి నోట్లో మట్టి కొట్టినందుకా మళ్ళీ రాష్ట్రానికి జగన్ రెడ్డి కావాలా? కేంద్రం మెడల వంచి ప్రత్యేక హోదా సాధిస్తారని ఓరెత్తించిన పెద్దమనిషి అధికారంలోకి వచ్చాక తన అవినీతి కేసుల నుంచి బయటకు వచ్చేందుకు కేంద్రానికి తలవంచి రాష్ట్రానికి రావలసిన నిధులను, విభజన చట్టంలో రావలసిన హామీలనుప్రత్యేక హోదా,రైల్వే జోన్, ఉత్తరాంధ్ర వెనుకబడి ప్రాంతాల నిధులను రాబట్టడంలో జగన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలం చేసినందుకా మళ్ళీ జగనే కావాలా? రాష్ట్రానికి జీవనాడిగానిలిచే పోలవరం ప్రాజెక్టును నాలుగున్నర సంవత్సరాలలో పైసా కూడా ఖర్చు చేయనందుకా, కేంద్రాన్ని కనీసం నిధుల కోసంగట్టిగా నిలదీయకుండా,ఢిల్లీ వెళ్ళిన ప్రతిసారి ఒక వినతిపత్రం ఇచ్చి చేతులు దులుపుకున్నందుకు, సుమారు 60 బహిరంగ సభల్లో సిపిఎస్ రద్దుచేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు రుణం తీర్చుకుంటామని చెప్పి మోసం చేసినందుకు మళ్లీ జగనే కావాలా? తెలుగుదేశం ప్రభుత్వంలో ఒక్కసారి కూడా విద్యుత్ చార్జీలు పెంచుకుంటా నాణ్యమైన విద్యుత్ ను వినియోగదారులకు అందించి కరెంటు కోతలు లేకుండా నాడు చంద్రబాబు నాయుడు నిరంతరం సరఫరా చేశారని, విద్యుత్తును హెచ్ రేట్లకు కొనుగోలు చేసి వారి దగ్గర కమీషన్లు తీసుకుని డిస్కంలకు వచ్చిన నష్టాన్ని ప్రజలపై ఆ లోటును భర్తీ చేయడానికి వినియోగదారులకు 9 సార్లు కరెంటు చార్జీలు పెంచి వారి నడ్డి విరిచినందుకా మళ్ళీ జగన్ కావాలా? రైతులకు ప్రతి సంవత్సరం 50 వేల రూపాయలు ఇస్తామని చెప్పి 37,500 మాత్రమే సంవత్సరానికి ఇచ్చి మోసం చేసినందుకు మళ్ళీ జగన్ కావాలా? రుణమాఫీ, అన్నదాత సుఖీభవ, డ్రిప్ ఇరిగేషన్ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పథకాలను రద్దుచేసి రైతులకు రెండు లక్షల నష్టం కలిగించినందుకు మళ్ళీ జగన్ కావాలా? 2 లక్షల కోట్లకు పైగా మద్యం అమ్మి పేదలను కొల్లగొట్టి మధ్య నిషేధం దశలవారీగా నిషేధిస్తామని చెప్పి, నిషేధం మాట దేవుడెరుగు బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి మద్యాన్ని ఏరులై పారిస్తూ మహిళలు మాంగల్యాలు తెంచుతున్నందుకా జగన్ కావాలి? మూర?పు పాలనతో రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసి ప్రజలపై భారాలు మోపి పన్నులు పెంచి,నిత్యవసర వస్తువులు ధరలు పెంచి, పెట్రోల్ డీజిల్ ధరలు దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ లోనే అత్యధిక అమ్మినందుకు మళ్లీ జగన్ కావాలా ? జగన్ రెడ్డి పై మండిపడ్డారు. ఇవే వైసీపీకి చివరి ఎన్నికలని ఎప్పుడు ఎన్నికలు జరిగినా తెలుగుదేశానికి పట్టం కట్టడానికి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయటానికి ప్రజలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నారని నాగ జగదీశ్ ఆశాభావం వ్యక్తపరిచారు. విలేకరుల సమావేశంలో పార్లమెంటు కమిటీ సభ్యులు అనుబంధ సంస్థల సభ్యులు మల్ల శివన్నారాయణ సాలాపు నాయుడు బొడ్డేడ మురళి విల్లూరి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

## డైట్ లో ఘనముగా దీపావళి వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (అటానమస్) నందు దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి.కళాశాల విద్యార్థులకు 'డైట్ లిటరరీ కల్చర్' కమిటీ నిర్వహించిన మండలా ఆర్ట్స్ ,దియా పెయింటింగ్స్ వంటి పోటీలలో అధికసంఖ్యలో విద్యార్థులు ఉత్సాహముగా పాల్గొన్నారు. ముందుగా దీపావళి జ్యోతి ని కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ వెలిగించి కల్చరల్ ఈవెంట్ లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.విద్యార్థులకు ,కళాశాల సిబ్బందికి మట్టి ప్రమిదలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పర్యావరణం కలుషితం జరగకుండా మట్టి ప్రమిదలు వాడి ప్రతిఒక్కరు బాణాసంచా లు వెలిగించినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ దీపావళి పండుగను సంతోషముగా జరుపుకోవాలని , అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమములో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ .వైకుంఠ రావు ,వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## ప్రపంచంలోనే మొట్టమొదటి పూర్తిస్థాయి కంటి మార్పిడి

ఇప్పటి వరకూ ప్రపంచంలో పూర్తిస్థాయిలో కంటి మార్పిడి చికిత్స జరగలేదు. చూపులేని వారికి దాతల కార్నియాను స్వీకరించి అమర్చుతుంటారు. కానీ, పూర్తిగా కన్నును తీసి అతికించడం మాత్రం మొదటిసారిగా ఇటీవల అమెరికా వైద్యులు నిర్వహించారు. అయితే, అతడికి చూపు వస్తుందా? అనేది మాత్రం కచ్చితంగా తెలియకపోయినా.. ప్రయోగం మాత్రం కొంత వరకూ ఫలించినట్టేనని చెబుతున్నారు. ఎందుకంటే..అమర్చిన కంటికి రక్తప్రసరణ జరుగుతోందని, మెదడుకు సంకేతాలు వెళు తున్నాయని వారి పరిశీలనలో వెల్లడైనట్టు తెలిపారు. ఆధునిక వైద్యశాస్త్రం మరో ఘనత సాధించింది. . న్యూయార్క్‌లోని సర్జన్ల బృందం ఓ వ్యక్తికి మొత్తం కంటిని మార్పిడి చేశారు. . శస్త్రచికిత్సలో దాత ముఖం భాగాన్ని, మొత్తం ఎడమ కన్నును తొలగించి వాటిని గ్రహీతకు అతికించారు. 46 ఏళ్ల లైన్ వర్కర్ ఆరోన్ జేమ్స్ 17 జూన్ 2021లో విద్యుత్ షాక్‌కు గురైననప్పుడు ముఖం లైవ్ వైర్‌ను తాకి ఎడమ కన్ను దెబ్బతింది.ఎడమ కన్ను, మోచేయి పైన ముక్కు, పెదవులు, ముందు పళ్లు, ఎడమ చెంప, గడ్డం ఎముక వరకు సహా విస్తృతమైన గాయాలయ్యాయి. ముఖ పునర్నిర్మాణానికి సంబంధించిన ప్రముఖ ఆస్పత్రి లాంగోన్ హెల్త్‌కి తరలించగా.. మే 27న అతడికి శస్త్రచికిత్స చేశారు. చాలా ఏళ్లుగా మొత్తం కంటిని మార్పిడిపై ప్రయోగాలు జరుగుతున్నాయి. ఈ ప్రయత్నంలో శాస్త్రవేత్తలు ఎలుకలలో కొంత విజయాన్ని సాధించినప్పటికీ.. అవి పాక్షిక దృష్టిని పునరుద్ధరించాయి. మనుషులకు ఇంతకు ముందెన్నడూ ఈ సర్జరీ నిర్వహించలేదు.త్రీడి కట్టింగ్ మార్గదర్శకాలను ఉపయోగించి మేము మొట్టమొదటి పూర్తి కంటి మార్పిడిని ముఖంతో పూర్తి చేశాం. ఇది చాలా మంది చాలా కాలంగా ఎదురుచూస్తోన్న అద్భుత మైన ఫీట్ల అని శస్త్రచికిత్సకు నాయకత్వం వహించిన ఎడ్వర్డో రోడ్రిగ్జ్ అన్నారు. సర్జరీకి మొత్తం 21 గంటల పట్టిందని, మేము ఇంతకంటే ఖచ్చితమైన రోగిని కోరలేదని అన్నారాయన.

మార్పిడి చేసిన ఎడమ కన్ను రెటీనాకు ప్రత్యక్ష రక్త ప్రసరణ సహా కాంతిని స్వీకరించడం, మెదడుకు చిత్రాలను పంపడానికి బాధ్యత వహించే విషయంలో ఆరోగ్య పరంగా మంచి సంకేతాలను చూపించింది. అయినప్పటికీ జేమ్స్ తన చూపును తిరిగి పొందుతాడని ఖచ్చితంగా చెప్పలేమని అన్నారు. కానీ, ఇది చాలా పెద్ద ప్రయోగమే అని 15 ఏళ్లుగా అదే రంగంలో పనిచేస్తున్న కొలరాడో అన్స్చుట్జ్ మెడికల్ క్యాంపస్ యూనివర్సిటీ శస్త్రచికిత్స ప్రొఫెసర్ కియా వాషింగ్టన్ అన్నారు. చాలా కష్ట సమయంలోఉన్న నాకు జీవితంలో రెండో అవకాశం కల్పించిన దాత, అతని కుటుంబానికి నేను మాటల్లో చెప్పలేనంత కృతజ్ఞతలు తెలుపుతున్నాను. దాతలో కొంత భాగం నాతో జీవిస్తున్నారని తెలుసుకోవడం ద్వారా కుటుంబం ఓదార్పును పొందుతుందని నేను ఆశిస్తున్నాన్న జేమ్స్ చెప్పారు. ప్రస్తుతం ఇంటికి చేరుకున్న అతడు నెలవారీ చెకప్‌ల కోసం ఆస్పత్రికి వస్తున్నాడని వైద్యులు తెలిపారు. శస్త్రచికిత్స తర్వాత గడిచిన సమయాన్ని బట్టి జేమ్స్ కంటి చూపు తిరిగి వచ్చే అవకాశం ఉందని తాను అనుకోలేదని, కానీ అసాధ్యం అని నేను ఎప్పుడూ చెప్పను వాషింగ్టన్ అన్నారు. ఇక, లాంగోన్ బృందం నరాల పనితీరును ప్రోత్సహించడానికి ఎముక మజ్జ నుంచి ఉత్పన్నమైన వయోజన మూలకణాలను ఉపయోగించారు.



# సోగ్గాడే చిన్నినాయన: సాంగ్ కి రవి నాకు సూట్ అయ్యాడు

## సీనియర్ సినీ నటుడు ప్రసన్నకుమార్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** హీరో నాగార్జున నటించిన సోగ్గాడే చిన్నినాయన చిత్రంలోని. వస్తానే వస్తానే అనే పాటకు,, అచ్చు సరిపోలికలతో.. సినీ నటుడు రవి నాగు హీరోగా.. అనూష రాజ్ హీరోయిన్ గా.. అద్భుతంగా నటించి. డాన్స్ పెర్ఫార్మెన్స్ చేసిన. రవి నాగు సూట్ అయ్యాడని.. ప్రముఖ చలనచిత్ర సీనియర్ నటులు ప్రసన్నకుమార్ . అన్నారు. ఆర్ఆర్ మేకర్స్ పతాకంపై, ఉత్తరాంధ్రలో పేరు ఉన్న దర్శకుడు అయినా మల్లా విజయ్ దర్శకత్వ నేపథ్యంలో ఇటీవలే చిత్రీకరించిన. వస్తానే వస్తానే. కవర్ సాంగ్ రిలీజ్ ఫంక్షన్ కి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన, ప్రసన్నకుమార్. మాట్లాడుతూ, వైజాగ్ నాగ్ అనే . బిరుదాంకితుడైన రవి నాకు . చాలా కాలంగా సుపరిచితుడని. ఎన్నో సినిమాలు ఆయనవి నేను చూశానని... ఈ సినిమాలో సాంగ్ అద్భుతంగా. నటించి పర్ఫార్మెన్స్ చేశారని.. సోషల్ మీడియాలో అత్యధికంగా రేటింగ్ రావాలని అకాంక్షిస్తున్నానని తెలియజేశారు. హీరో రవి నాగ్ మాట్లాడుతూ, నా కవర్ సాంగ్ రిలీజ్ వేడుకకు ఇంతమంది హాజరైనందుకు ఆనందంగా ఉందని నన్ను సహకరించిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతాభివందనాలు అన్నారు. అనకాపల్లి వాస్తవ్యులు రాజకీయ వేత్త, కళా పోషకులు. సంఘ సేవకులు. అయిన మల్ల సురేంద్ర మాట్లాడుతూ.. రవి నాగు చిరకాల సుపరిచితుడని. ఇదివరకే ఆయనతో ఎన్నో ప్రోగ్రాములు నిర్వహించానని. సోషల్ మీడియా ప్రధాన పాత్ర వహిస్తుందని. రవి నాగు కి మంచి భవిష్యత్తు ఉంటుందని కొనియాడారు. సినీ ప్యాడింగ్ ఆర్టిస్ట్ బాబు దేవ్ మాట్లాడుతూ.. రవి నాగు. నాకు చిరకాల మిత్రుడని. హీరోగా ఆయన మూడు సినిమాలు చేశారని. చదువే నీ ఆయుధం. చిత్రం త్వరలో విడుదలవుతుందని.. సాంగ్ లో అద్భుతంగా నటించారని. మల్ల విజయ్ దర్శకత్వ ప్రతిభ కనిపించిందని, ఈ వేడుకకు తనను ఆహ్వానించడం, ఆనందదాయకమని. హాజరైన ప్రతి ఒక్కరికి పేరుపేరునా.. కళాభివందనాలు తెలియజేశారు.. మల్ల విజయ్ మాట్లాడుతూ నాతో ఎన్నో సినిమాలు చేసిన రవినాగు. కృతజ్ఞతాపూర్వకంగా. ఈ కవర్ సాంగ్ చేశానని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ సోషల్ మీడియా స్టేట్ చైర్మన్. సన్‌మూర్తి మాట్లాడుతూ ఈరోజు సోషల్ మీడియా ప్రధాన పాత్ర పోషిస్తుందని రేటింగు వ్యూవర్స్ ప్రకారం. అనంత లోకాలకు చేరవేస్తుందని. ఇంత అద్భుతంగా నటించినా రవి నాకు మిత్రుడని కవర్ సాంగ్ చాలా బాగా వచ్చిందని చెప్పారు. అనంతరం మల్లా సురేంద్ర. ప్రసన్నకుమార్ చేతులు మీదుగా ఈ కవరసాంగుని. యూట్యూబ్ లో అప్లోడ్ చేసి విడుదల చేశారు... ఇంకా కార్యక్రమంలో ఆర్ఆర్ స్టూడియో అధినేత రాజారెడ్డి, ఎడిటర్ మణికంఠ. సీనియర్ సినీ జర్నలిస్టు, సినీ గ్రంథకర్త, సినీ విశ్లేషకులు. హీరో అక్కినేని నాగేశ్వరరావు, జీవిత విశ్లేషకులు, అయిన నవీన్ ప్రసాద్, దహనం సినిమా డైరెక్టర్ ఆడారి మూర్తి, ఆంధ్రప్రదేశ్ సోషల్ మీడియా చైర్మన్ సన్ మూర్తి. హీరోయిన్ అనూష రాజ్.. సినీ నటులు నాయుడు. రాజు. తదితరులతో పాటు అధిక సంఖ్యలో సినీ అభిమానులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.


**YELAMANCHILI MUNICIPALITY**
**TENDER NOTICE**

Yelamanchili Municipality Invited following tenders vla 'e'-Procurement Platform for taking up development works under GGMP Grant & General Funds.

| | |
|---|---|
| Total No or works | : 39 Works |
| Total Estimates value | : Rs 165.70 Lakhs |
| Total Ecv | : Rs 144.02 Lakhs |
| BID Starting Date & Time | : 10-11-2023 by 11.00 AM |
| BID Ending Date & Time | : 20-11-2023 by 03.30 PM |

For details logon to www.apeprocurement.gov.in Contact Ph. No. 7337224401, 7334224407.

Sd/-K.A.Kondala Rao
COMMISSIONER
YELAMANCHILI MUNICIPALITY


## 13న జగనన్నకు చెబుదాం (స్పందన) నిర్వహించబడదు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఈ నెల 13వ తేదీ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరగాల్సిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహించబడదని జిల్లా కలెక్టర్ డా ఎ మల్లిఖార్జున తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. దీపావళి పర్వదినం సందర్భంగా సోమవారం సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించిన సంగతి విదితమే. కావున అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి, జిల్లా ప్రధాన కేంద్రానికి రావద్దని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

## సీఐడీ పీటీ వారెంట్ పై విచారణ డిసెంబరు 1కి వాయిదా

ఫైబర్ నెట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబుపై ఏపీ సీఐడీ సెప్టెంబరులో పీటీ వారెంట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. నిబంధనలు అతిక్రమిస్తూ టెరాసాఫ్ట్ కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చారని సీఐడీ ఆరోపిస్తోంది. కాగా, సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్ పై ఏసీబీ కోర్టు నేడు విచారణ చేపట్టింది. నవంబరు 30 వరకు చంద్రబాబును అరెస్ట్ చేయొద్దని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో, తదుపరి విచారణను ఏసీబీ న్యాయస్థానం డిసెంబరు 1కి వాయిదా వేసింది.

విచారణ సందర్భంగా పీటీ వారెంట్ పై సీఐడీ తరఫు న్యాయవాది మెమో దాఖలు చేశారు. ఇదే కేసులో టెరాసాఫ్ట్ సంస్థ ఆస్తులు అటాచ్ చేయాలంటూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్ ను కూడా ఏసీబీ కోర్టు విచారించింది. ఈ పిటిషన్ పై తదుపరి విచారణను ఈ నెల 17కి వాయిదా వేసింది.

**కిలారు రాజేశ్ లంచ్ మోషన్ పిటిషన్ పై హైకోర్టులో విచారణ**

స్కిల్ కేసులో నారా లోకేశ్ సన్నిహితుడు కిలారు రాజేశ్ కు సీఐడీ నోటీసులు ఇవ్వడం తెలిసిందే. తనకు సీఐడీ నోటీసులు ఇవ్వడాన్ని కిలారు రాజేశ్ హైకోర్టులో సవాల్ చేశారు. ఆయన హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై హైకోర్టు ధర్మాసనం నేడు విచారణ చేపట్టింది.

రాజేశ్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు.... 161, 91 సెక్షన్ల కింద నోటీసులు ఇవ్వడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎల్ఓసీ నోటీసుల్లో రాజేశ్ ను నిందితుడి పేర్కొన్నారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

సీఐడీ తరఫు న్యాయవాది స్పందిస్తూ... తాము రాజేశ్ ను నిందితుడిగా పేర్కొనలేదని, ఎల్ఓసీ పొరపాటున ఇచ్చామని తెలిపారు. కౌంటర్ దాఖలు చేసేందుకు తమకు కొంత సమయం కావాలని సీఐడీ తరఫు న్యాయవాది కోర్టుకు విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న అనంతరం ఏపీ హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 17కి వాయిదా వేసింది.


క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు సంప్రదించండి
8008767633,
7981904385


## ఇకపై విశాఖలో తిరుమల లడ్డూ విక్రయం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం ఇకపై ఎండాడ కొండపై ఉన్న గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతీనెల రెండవ శనివారం నాడు విక్రయించనున్నట్లు ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి జగన్మోహనాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 750 గ్రాములు బరువు గల కళ్యాణ లడ్డూ రూ. 250 లకు, 140 నుండి 170 గ్రాముల నడుమ బరువు తూగే సాధారణ లడ్డూ రూ. 50కి తిరుమల కొండపై మాదిరిగానే విక్రయిస్తారని, భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు : కలెక్టర్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జిల్లా ప్రజలందరికి జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, దుష్ట శక్తులపై దైవశక్తి సాధించిన విజయాలకు ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారని కలెక్టర్ తెలిపారు. ఈ పండుగతో ప్రజల జీవితాల్లో ఆనంద కాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని, దివ్వెల వెలుగులలో ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో విరాజిల్లాలని కలెక్టర్ ఆ ప్రకటనలో ఆకాంక్షించారు.


సంతాన సాఫల్యతకు
ఆయుర్వేద మందులతో చికిత్స
కృత్రిమ పద్ధతులు కాకుండా ఎటువంటి ఆపరేషన్స్ లేకుండా మీరే మీ పిల్లలుగా పుట్టాలి అనుకునే వారు సంప్రదించండి.
Dr.R. Sivaji Ph.D,. INFERTILITY SPECIALIST
ట్రైఫోర్స్ : మీ వ్యాదులకు మీరు వాడే మందులతో పాటు వాడిన ఆయా వ్యాదులు తొందరగా శాస్వతంగా తగ్గుతాయి ట్రైఫోర్స్ పోర్ట్ : వ్యాదులు రాకుండా ముందు జాగ్రత్తకు వాడే మందు. ఇది నిత్య యవ్వనంతో సంపూర్ణ ఆరోగ్యంతో దీర్ఘకాలం జీవించేలా చేస్తుంది.

Online & offline Cell: 94401 04422



KALAVEDIKA
కళావేదిక
కల్చరల్ & ఛారిటబుల్ ట్రస్ట్
30 సం॥ల వార్షికోత్సవ వేడుకలు
పుస్తక ఆలయం Book Bank
ఆహ్వానము
30వ వార్షికోత్సవ వేడుకలు
బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో గల వివిధ పాఠశాలలు, జూనియర్ కళాశాలలలోని నిష్ణాతులైన విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు, ప్రశంసా పత్రముల బహూకరణ
పౌర గ్రంథాలయం, హాల్ నెం. 1 (ఎ/సి) ద్వారకానగర్, విశాఖపట్నం.
తేది 12-11-2023 ఆదివారం ఉ॥ 9:30 గం॥లకు
సభాధ్యక్షులు : డా॥ నండూరి రామకృష్ణ, వ్యవస్థాపక అధ్యక్షులు, కళావేదిక
ముఖ్య అతిథి : జస్టిస్ డి.వి. సోమయాజులు గారు, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్
ఆత్మీయ అతిథి : Wr. కమల్ బైద్, MGF, Kubera Donor, Founder, ACN Infotech India Limited
ప్రత్యేక ఆహ్వానితులు: శ్రీ డి. శ్రీనివాస వర్మ, కార్యదర్శి, పౌర గ్రంథాలయం; శ్రీ ఆర్. రామకృష్ణ రాజు, మేనేజింగ్ పార్టనర్, ధనుంజయ్ బిల్డర్స్
ముందుగా బాలబాలికలచే సాంస్కృతిక కార్యక్రమాలు
శ్రీ కమల్ బైద్ గారిని కళావేదిక గౌరవ అధ్యక్షులుగా
తీర్మానం చేస్తూ వారికి చిరు సత్కారం
అందరూ ఆహ్వానితులే
శ్రీమతి శ్రీమణి, ప్రధాన కార్యదర్శి
శ్రీ అరుణం శ్రీనివాస్, నిర్వాహకులు
డా॥ బి. రజని, కార్యదర్శి



GOLDEN INDUSTRIES
GOLDEN THINGS
Chicken Dressing Machine, Grinders & Rubbers
Sales & Service Done Here


Cell : 7997792877, 9493984896
# 9-72/3, Daminedu, Near Collector Office, Tirupathi.


VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Simhachalam : Cell: 96660 15921, Pardwada : Cell: 77804 33919, ,
Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8885687610, VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676